దాతల సాయం.. ఆదరణ మాయం!



దుర్గగుడికి వచ్చే దివ్యాంగ భక్తులు, వృద్ధుల కోసం దాతలు అందజేసిన వీల్‌ఛైర్లు దేవదాయ శాఖ అధికారులు మూలన పడేశారు. మహామండపంలో భక్తులు దర్శనం అనంతరం కిందకు దిగే మెట్ల మార్గంలో వీటిని పడేశారు. చిన్నపాటి మరమ్మతులు చేసి.. వీటిని వినియోగంలోకి తెస్తే.. దసరా వేళ ఎందరికో ఉపకరిస్తాయి. - ఈనాడు, అమరావతి

భక్తులు దిగే మార్గం సిద్ధం!



దసరా ఉత్సవాల వేళ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న తర్వాత... కొండపై నుంచి కిందకు దిగేందుకు ఈసారి శివాలయం మెట్ల మార్గం లేదు. దీంతో తాత్కాలిక మెట్ల మార్గాన్ని సిద్ధం చేశారు. కొండపై నుంచి ఈ మెట్ల మార్గం ద్వారా భక్తులు కిందకు దిగనున్నారు. భారీ పరిమాణంలో ఇనుప మెట్లను తయారు చేయించి తీసుకొచ్చి అమర్చారు. శివాలయం మెట్ల మార్గం పక్కనే సిమెంట్‌తో కొంత భాగం వరకూ మెట్లు కట్టాక.. అక్కడి నుంచి ఈ ఇనుప మెట్లకు అనుసంధానించారు. - ఈనాడు, అమరావతి

మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌కు ముందడుగు

కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో ఎంపీ బాలశౌరి భేటీ

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం - కోనేరు సెంటర్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా దివిసీమ ప్రజల దశాబ్దాల కోరిక అయిన మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ నిర్మాణంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఎంపీ వల్లభనేని బాలశౌరి దిల్లీలో శుక్రవారం భేటీ అయ్యారు. మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్ నిర్మాణం ఆవశ్యకతను, ప్రాజెక్టుకు సంబంధించిన రూట్‌మ్యాప్ గురించి మంత్రికి వివరించారు. రైల్వే లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ లైన్ పనులు పూర్తిచేయాలనీ.. జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారని తెలియజేశారు. దీంతో మంత్రి అశ్వినీవైష్ణవ్ సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు. రైల్వే లైన్ నిర్మాణ సాధ్యాసాధ్యాలను తెలుసుకొని.. అవసరమైన వనరులను సమకూరుస్తామని.. ఇప్పటికే రైల్వే మంత్రి తనకు లేఖ రాశారని వెల్లడించారు. దీనిపై ఇప్పటికే మంత్రిని కలిశానని, తాజాగా రెండోసారి మళ్లీ భేటీ అయినట్లు తెలిపారు. పనులను త్వరలోనే ప్రారంభించే స్థాయిలో ఆశాజనకం ఉందన్నారు.



రూట్‌మ్యాప్‌ను మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు వివరిస్తున్న ఎంపీ బాలశౌరి

దూరం.. సమయం తగ్గుతుంది..

మచిలీపట్నం నుంచి గుడివాడ, విజయవాడ మీదుగా.. తెనాలి చేరుకోవాలంటే ప్రస్తుతం 120 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అదే మచిలీపట్నం-రేపల్లె మధ్య రైల్వేలైన్ ఏర్పాటు చేస్తే.. తెనాలి చేరుకోవడానికి చాలా దూరం తగ్గుతుంది. సమయం ఆదా అవుతుంది. అక్కడి నుంచి చెన్నై, తిరుపతి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణం సులభమవుతుంది. ప్రయాణికులే కాకుండా.. చేపలు, రొయ్యలు వంటి మత్స్య సంపదను సులువుగా రవాణా చేసేందుకు వీలుపడతుందని కేంద్ర మంత్రికి ఎంపీ వివరించారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం కూడా పూర్తయితే.. ఈ రైల్వేలైన్ వల్ల సరకు రవాణాకు కూడా ప్రయోజనం కలుగుతుందని ఎంపీ వెల్లడించారు.

ఈ- వ్యర్థాలు తరలించేలా చర్యలు తీసుకోండి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లాలో సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాల(ఈ-వేస్ట్)ను తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారిణి జె. అరుణ, నగర కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, తదితరులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని గృహాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతుల కేంద్రాలు, విక్రయ దుకాణాల నుంచి ఈ వ్యర్థాలు సేకరించాలని ఇచ్చిన ఆదేశాలపై పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 497 గ్రామ పంచాయతీలతో పాటు మచిలీపట్నం కార్పొరేషన్, పెడన, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప పురపాలక సంఘాల పరిధి నుంచి ఇప్పటి వరకూ 1.50 టన్నుల వ్యర్థాలు సేకరించామని, ఇంకా సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని డీపీవో అరుణ వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ సేకరించిన ఈ వేస్ట్‌ను బందరు మండల పరిధిలోని పోతేపల్లి వద్ద నిల్వ చేసి, అక్కడి నుంచి పునఃవినియోగం కోసం సంబంధిత పరిశ్రమకు పంపే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని మేజర్ పంచాయతీల్లో నిరంతరం వ్యర్థాలు సేకరించే విధంగా కియోస్కులు ఏర్పాటు చేయాలని సూచించారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ


శుభ్రతకు తొలి ప్రాధాన్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్వే పరిసరాల్లో పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైల్వే ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 'వేస్ట్ టు ఆర్ట్' ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో 2014లో ప్రారంభించిన స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాన్ని విజయవాడ డివిజన్‌లో విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. వేస్ట్ పరికరాలను రీసైక్లింగ్ చేసేందుకు 'వేస్ట్ టు ఆర్ట్' ప్రాజెక్టు వంటి సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రదర్శించిన నాటకం, నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, పీఈ ఎడ్విన్, డీఈఎన్(హెచ్ఎం) ఎం.కిశోర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్ఎం

సుపరిచితులే.. అపరిచితులు!



ఈనాడు డిజిటల్, అమరావతి

ఆగస్టు 3న భవానీపురంలో ఓ ప్రధానోపాధ్యాయుడు పదోతరగతి విద్యార్థినితో అసభ్యంగా మాట్లాడాడు. సాయంత్రం కంప్యూటర్ గదికి తీసుకెళ్లి వేధించాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

■ బందరులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతోందా బాలిక. ఈనెల 6న సాయంత్రం బడి వదిలాక స్నేహితురాలిని కలిసేందుకు వెళ్లి.. తిరిగొస్తోంది. ఓ యువకుడు ఆమెను అడ్డగించి బైక్‌పై నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి.. అఘాయిత్యం చేశాడు. మానసిక క్షోభ అనుభవించలేక వారం తర్వాత ఆమె ఇంట్లో చెప్పింది.

విస్సన్నపేట మండల విద్యార్థిని ఇంటర్ చదువుతోంది. అదే గ్రామ యువకుడు ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. ఈనెల 14న ఆమె కళాశాల నుంచి వెళ్తుండగా మధ్యలో ఓ భవనంలోకి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. మరుసటి రోజు బాధితురాలు తల్లికి వివరించగా..నిందితుడిపై పోక్సో కేసు పెట్టారు.

విస్సన్నపేట మండలంలో ఓ గ్రామంలో ఈనెల 14న తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లడంతో ఇంట్లో బాలిక ఒంటరిగా ఉంది. ఇదే అవకాశంగా అదే గ్రామానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి బలవంతంగా ఇంటి వెనుకకు లాక్కెళ్లి అకృత్యానికి పాల్పడ్డాడు. తర్వాత బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇలాంటి సంఘటనలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు ఎటువైపు నుంచి ఎప్పుడు ఏ ఆపద వస్తుందో తెలియట్లేదు. ఇటీవలి ఘటనలు పరిశీలిస్తే సుపరిచితులతోనే బాలికలకు ముప్పు పొంచి ఉన్నట్లు స్పష్టం అవుతోంది. ప్రేమని మాయమాటలు చెబుతున్నారు. నమ్మించి ఏకాంత ప్రదేశాలకు తీసుకెళ్లి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. చెంపలు తడుముతుంటే.. ముద్దు చేస్తున్నారని అనుకుంటున్నారే తప్ప రాక్షసుల కామ వాంఛను గ్రహించడంలేదు. అందుకే తల్లిదండ్రులు మేల్కోవాలి. పిల్లలకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' ఏదో తెలియజేయాలి.

తల్లిదండ్రులదే బాధ్యత..

పిల్లల భవిష్యత్తు విషయంలో ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంలోనూ అవగాహన కల్పించడానికి అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందులో ఆలస్యం జరగకూడదు. లేదంటే.. వారి జీవితంలో ఎక్కడైనా.. ఎప్పుడైనా ఇది పెను సమస్యగా మారి వేధిస్తుంది. పిల్లలకు ఎవరి వద్దయినా అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే వారి గురించి ఇంట్లో చెప్పమని చెప్పాలి. వారికేదైనా చేదు అనుభవం ఎదురైఉంటే సున్నితంగా, మెల్లగా అడిగి సమస్య తెలుసుకొని పరిష్కరించాలి.

ఉపాధ్యాయినుల పాత్ర కీలకం...

లైంగిక దాడులకు గురవుతున్న వారిలో గ్రామీణ బాలికలే అధికంగా ఉంటున్నారు. పేద కుటుంబాల పిల్లలు కావడం.. మంచి తిండి, డబ్బులకు ఆశగా చూస్తున్న ఎదురుచూపులను ఆసరాగా చేసుకొని పలువురు బరి తెగిస్తున్నారు. ఈనేపథ్యంలో గ్రామీణ పిల్లల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయినులపైనే ఎక్కువగా ఉంది. సమాజంలో జరుగుతున్న దుర్ఘటనలు చెప్పడంతోపాటు... శరీరంలో ఎక్కడెక్కడ తాకితే వ్యతిరేకించాలో అర్థమయ్యేలా తెలియజేసి చైతన్యపరచాలి. శరీరానికి సంబంధించి సొంతంగా కొన్ని నియమాలు ఉంటాయని పిల్లలకు తెలియాలి. వాటిని ఇతరులు అతిక్రమిస్తున్నప్పుడు స్పందించడమే కాదు.. తక్షణం వ్యతిరేకించడమెలాగో నేర్పించాలి.

మానసిక ధైర్యం అవసరం..



దగ్గర వాళ్లనుంచే అధికంగా అఘాయిత్యాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి శారీరక దృఢత్వం, తమని తాము రక్షించుకునేందుకు కరాటే, బాక్సింగ్, తైక్వాండో వంటివి నేర్పించాలి. ఉపాధ్యాయులు పాఠాలతో పాటు నైతిక విలువలు, సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, వాటి నుంచి బయటపడే మార్గాల గురించి వివరించాలి. బాలికలతో అసభ్యంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

– ముక్తేవి ఫణిప్రసాద్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

పర్యాటక అవార్డుల ప్రదానం

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పలువురికి పర్యాటక అవార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. విజయవాడకు చెందిన పలు హోటల్స్, సంస్థలకు అవార్డులు లభించాయి. ఉత్తమ 3 స్టార్ హోటల్‌గా హోటల్ మినర్వ గ్రాండ్‌కు, ఉత్తమ రెస్టారెంట్‌గా జింగ్-హయత్ ప్లేస్, ఉత్తమ స్టాండ్ ఎలోన్ రెస్టారెంట్‌గా యునైటెడ్ తెలుగు కిచెన్, ఉత్తమ చెఫ్‌గా (ఆంధ్రా క్యూజిన్) కనికెళ్ల చంద్రశేఖర్ (ఫార్చ్యూన్ మురళీ పార్క్), ఉత్తమ ట్రావెల్ ఏజెంట్‌గా ట్రావెలీ క్యూ గ్లోబల్ సొల్యూషన్స్, ఉత్తమ అడ్వెంచర్ టూర్ ఆపరేటర్‌గా ది అమరావతి బోటింగ్ క్లబ్, ఉత్తమ ఎమెర్జింగ్ ట్రావెల్ కంపెనీ ప్రమోటింగ్ ఏపీ టూరిజంగా అతిథి హాలిడేస్‌లకు అవార్డులు లభించాయి.



ఉత్తమ రెస్టారెంట్‌గా జింగ్-హయత్ ప్లేస్ ప్రతినిధికి పురస్కారం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కన మంత్రి కందుల దుర్గేష్ తదితరులు





కూలిపోతున్నాయ్.. కళ్లు తెరవండి



కోడూరు మండల పరిధిలోని 15వ నంబరు పంట కాలువ వెంబడి రామకృష్ణాపురం నుంచి హంసలదీవి వెళ్లే విద్యుత్తు లైనుకు కలపడానికి కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు స్తంభాలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేలకొరిగాయి. స్తంభాలు ఏర్పాటులో లోపమా, లేక పూర్తి స్థాయిలో పనులు పూర్తికాకపోవడం వల్ల నేలకొరిగాయా అనే విషయం చర్చనీయాంశమైంది. స్తంభాలు పడిపోయి 20 రోజులకు పైగా గడిచినప్పటికీ పునరుద్ధరించలేదని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలకు వైర్లు ఉండడంతో వాటిలో విద్యుత్తు సరఫరా ఉందని ప్రజలు భయపడుతున్నారు. ఉయ్యూరు విద్యుత్తు శాఖ ఈఈ డి.కృష్ణనాయక్ మాట్లాడుతూ నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలను త్వరలో పునరుద్ధరించి విద్యుత్తు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు అవనిగడ్డ ఏడీఈకి ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కోడూరు (అవనిగడ్డ)

రెవెన్యూ బదిలీల్లో ప్రతిష్ఠంభన

వీఆర్వోల మూకుమ్మడి బదిలీలకు ఎమ్మెల్యే సూచన

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గన్నవరం నియోజకవర్గంలో రెవెన్యూ బదిలీలకు సంబంధించి ప్రతిష్ఠంభన ఏర్పడింది. వీఆర్వోలను మార్చే విషయంలో సందిగ్ధం కొనసాగుతుంది. మూడ్రోజుల కిందటే బదిలీలకు ఉత్తర్వులు వెలువడ్డాయి. మూడు మండలాలకు సంబంధించి భారీగా వీఆర్వోలకు స్థానం కల్పించారు. వీరిలో ఎక్కువ మందిని ఒక మండలం నుంచి మరో మండలానికి, మరికొందర్ని అదే మండలంలో కొనసాగిస్తూ వేరే గ్రామానికి బదిలీ చేశారు. కానీ వీరంతా గత అయిదేళ్లుగా ఇక్కడ పనిచేయడం, ఎక్కువ మంది మాజీ ఎమ్మెల్యే వంశీ, ఆయన ప్రధాన అనుచరులతో అంటకాగి, అక్రమాలకు సహకరించారంటూ స్థానిక తెదేపా నాయకుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో అందరు వీఆర్వోలను ఇక్కడ నుంచి బదిలీ చేయాల్సిందిగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్‌కు సూచించినట్లు సమాచారం. ఈ ప్రకారం దాదాపు 60 మంది వీఆర్వోలను మార్చాల్సి వస్తుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఇంతమందిని ఇప్పటికిప్పుడు మార్చడం కష్టమనే అభిప్రాయం కలెక్టరేట్ నుంచి వ్యక్తమైంది. దీంతో వైకాపా ప్రభుత్వ హయాంలో ఏకపక్షంగా వ్యవహరించినట్లుగా ఆరోపణలున్న 20 మందిని మార్చేలా కసరత్తు చేపట్టినట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లోనే ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశముంది.

తేల్చమంటే.. తేల్చేశారు..!

అక్రమాల లోతుల్లోకి వెళ్లకుండా నామమాత్ర విచారణ

గత ప్రభుత్వ కీలక వ్యక్తుల అండతోనే తొక్కిపెట్టిన తీరు

ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీలో మరుగున వాస్తవాలు

ఈనాడు, అమరావతి

ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీలో అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. అవకతవకలు తేల్చాల్సిన విచారణలోనూ వాస్తవాలు వెలుగులోకి రాలేదు. ఉద్దేశపూర్వకంగా పలు కీలక అంశాలను తొక్కిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. విచారణ అధికారి నివేదిక అసమగ్రంగా ఉందనీ, కొన్నింటిని అసలు పరిశీలించలేదని రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ (ఆర్సీఎస్) అభిప్రాయపడ్డారు. దీనిపై దర్యాప్తులో స్పృశించని కొన్ని ముఖ్యాంశాలపై అదనపు నివేదిక కోరారు. ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలో శ్రీహరిపురం ప్రభుత్వ ఉద్యోగుల కాలనీలో రూ.కోట్లలో జరిగిన అక్రమాలను 'ఈనాడు' వరుస కథనాలతో నిరుడు వెలుగులోకి తెచ్చింది. స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. దీనిపై ఆశలు పెట్టుకున్న సభ్యులు.. విచారణ నివేదిక చూసి ఖంగుతిన్నారు. సూత్రధారులకు.. గత ప్రభుత్వంలో కీలక వ్యక్తుల అండ ఉండడమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలనీ, వాస్తవాలను వెలుగులోకి తేవాలని సభ్యులు కోరుతున్నారు.



విస్మరించిన అసలు అంశాలు

★ సంఘ సభ్యులు కాని 41 మందికి ప్లాట్లను కేటాయించారు. సహకార చట్టం ప్రకారం ఇతరులకు ప్లాట్లను అమ్మడం చట్టవిరుద్ధం. ★ సభ్యుల నుంచి రిజిస్ట్రేషన్ రుసుము కింద వసూలు చేయాల్సిన మొత్తం కన్నా రూ.2.50 కోట్లు అదనంగా వసూలు చేశారు. దీనిపై విచారణాధికారి సరైన నివేదిక ఇవ్వలేదు. అదనంగా వసూలు చేసిన మొత్తం సంఘానికే జమ చేసినందున. . నిధుల దుర్వినియోగానికి తావులేదన్నారు. కానీ నష్టపోయిన సభ్యులకు ఎలా న్యాయం చేయాలో చెప్పలేదు. ★ భూయజమానులకు సొమ్ము చెల్లించకుండా ముందు తేదీల (పోస్ట్ డేటెడ్) చెక్కుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిని దాచి.. చట్టబద్ధత లేని దస్తావేజుల ద్వారా సభ్యులను మోసం చేసి ప్లాట్లు అంటగట్టారు. సభ్యుల నుంచి వసూలు చేసిన సొమ్ము భూ యజమానులకు చెల్లించకుండా ఇతర అవసరాలకు మళ్లించారు. ప్లాట్ల అమ్మకం పూర్తయ్యాక ఆరుగురు రైతులు తమకు రూ.50 కోట్లు చెల్లించలేదని కోర్టుకెళ్లారు. వ్యాజ్యం వేసిన వారితో సంప్రదింపులు జరిపి.. పరిష్కరించుకోవాలని విచారణాధికారి సూచించడం గమనార్హం.


సమాధానాల్లేని ప్రశ్నలు....

★ సంఘ నిర్వహణలో మితిమీరిన ఖర్చు చేశారు. రూ.44 లక్షలకు ఓచర్లు లేకుండానే లెక్క చూపారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అధ్యక్షుడిపై క్రిమినల్ చర్యలు కానీ అదనంగా ఖర్చు చేసిన మొత్తం వసూలుకు బాధ్యులనూ గుర్తించలేదు. అధ్యక్షుడిపై తగు చర్యలను మాత్రమే సూచించారు. ★ లే ఔట్‌లో మౌలిక వసతులకు కేటాయించిన భూమిని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థకు తాకట్టు పెట్టడం..అక్రమమో.. సక్రమమో తేల్చలేదు. సీఆర్డీఏ నిబంధనల ప్రకారం.. లే ఔట్ ఆమోదానికి.. వసతులకు స్థలాల కేటాయింపు తప్పనిసరి. ★ సభ్యుల తొలగింపుపై కూడా అస్పష్ట వైఖరే. అక్రమాలను ప్రశ్నించిన 29 మంది సభ్యులు ప్లాట్ల యాజమానులైనా వారి సభ్యత్వాలు రద్దు చేశారు. దీనిపై ఫిర్యాదుల పరిష్కార కమిటీ వేయాలని సూచించారు.

ఏదీ తేల్చకుండా వదిలేశారు...

ఫిర్యాదులో అంశాలను దర్యాప్తులో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవడం దర్యాప్తు అధికారి ప్రాథమిక బాధ్యత. కానీ కర్తవ్యాన్ని విస్మరించి.. జనరల్ బాడీ ఆమోదం పొందినందున కొన్ని అంశాలపై తదుపరి చర్యలు అవసరం లేదని పేర్కొన్నారు. కోరం లేకపోయినా బోగస్ సంతకాలతో సమావేశాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కోరం లేకపోవడంతో ఈనెల 14న జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. దీనికి పరిశీలకుడిగా విజయవాడ డీఎల్‌సీవో కిరణ్ కుమార్ హాజరయ్యారు. తదుపరి ఈనెల 29న జరగాల్సిన సమావేశానికి పరిశీలకులు వచ్చే వీల్లేనందున బోగస్ సంతకాలతో తతంగం నడిపేలా రంగం సిద్ధం చేస్తున్నారనే విమర్శలున్నాయి. సభ్యులు హైకోర్టులో కేసులు దాఖలు చేసిన అంశాలను న్యాయ పరిధిలో ఉన్నాయని ఏదీ తేల్చకుండా కేవలం సూచనలిచ్చి వదిలేయడం గమనార్హం. నిధుల దుర్వినియోగం జరిగిందీ లేనిదీ పేర్కొనలేదు.


ముస్తాబైన ఆలయం


బాలాత్రిపురసుందరి దేవి

3 నుంచి శరన్నవరాత్రులు

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పయిన బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబరు 3 నుంచి 13 వరకు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం చండీహోమం, లలితా మహిళా మండలి వారిచే లలిత, విష్ణు సహస్రనామ పారాయణం, అమ్మవారికి అర్చనలు, శ్రీచక్రార్చన, బాలపూజలు, లలిత సహస్రనామార్చనలు, దేవీ ఖడ్గమాలాస్తోత్ర పారాయణం తదితర పూజా క్రతువులను జ్యోష్యుల కార్తికేయశర్మ(గుడివాడ) నిర్వహిస్తారు. చండీహోమాన్ని రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి, శిష్ట్లా శ్రీమన్నారాయణశర్మ (మచిలీపట్నం), రామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకాలు చింతపాటి రామకృష్ణ(ఉయ్యూరు), స్వామివార్లకు అలంకరణలు పెనుమూడి సతీష్‌కుమార్‌శర్మ, పెనుమూడి పూర్ణచంద్రశేఖరశర్మ, రాకేష్ శర్మ(దేవస్థానం) నిర్వహిస్తారు. 3న స్వర్ణకవచాలంకృత బాలాత్రిపురసుందరీదేవిగా, 4న రజత కవచాలంకృత బాలాత్రిపురసుందరిదేవిగా, 4న గాయత్రీదేవిగా, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితాత్రిపురసుందరిదేవి, 8న మహాలక్ష్మీదేవిగా, 9న సరస్వతీదేవిగా, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధని, 12న రాజరాజేశ్వరిదేవి, 13న సంతోషిమాతగా అలంకరిస్తారు.

వెంకట కృష్ణారావు గొప్ప మానవతావాది : ఆలపాటి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు గొప్ప మానవతావాది అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. వెంకట కృష్ణారావు 27వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గాంధీక్షేత్రంలో, వంతెన కూడలిలో ఆయన విగ్రహానికి పలువురు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణారావు చిన్న వయసులోనే రాజకీయాల్లో రాణించారన్నారు. నిర్దిష్ట ఆలోచనలతో ఎదిగి, తండ్రి ఆశయాలను పుణికి పుచ్చుకొని బాల్యం నుంచి గాంధేయవాదంతో రాజకీయాల్లో విస్తృత ప్రజాసేవ చేశారన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దివిసీమ ఉప్పెనలో గ్రామాలు ఊడ్చుకుపోగా కృష్ణారావు చేసిన పునర్నిర్మాణ కార్యక్రమాలు అనితర సాధ్యమన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన కృషి మరచిపోలేనిదని చెప్పారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, మత్తి శ్రీనివాసరావు, పూతబోయిన సీతారత్నసాయిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


వెంకటకృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజేంద్రప్రసాద్, బుద్ధప్రసాద్ తదితరులు

జీరో డిఫెక్ట్, ఎఫెక్ట్ పద్ధతులపై అవగాహన నేడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం సూరంపల్లి ఎలీప్ మహిళా పారిశ్రామికవాడ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ సంస్థ విజయవాడ కార్యాలయంలో జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్ (జడ్‌ఈడీ) పద్ధతులపై ఎంఎస్‌ఎంఈలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎలీప్ ఛైర్‌పర్సన్ కె.కనకదుర్గ తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పోటీతత్వాన్ని పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఛాంపియన్‌లుగా మార్చేందుకు విస్తృత డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ జడ్‌ఈడీ సర్టిఫికేషన్ కంచు, రజత, పసిడి మూడు స్థాయిల్లో ఉంటుందని 'ఉదయం' రిజిస్ట్రేషన్ పోర్టల్‌తో నమోదు చేసుకున్న ఔత్సాహికులు మాత్రమే అర్హులన్నారు. ఈ సర్టిఫికేషన్ ద్వారా అన్ని రకాల సబ్సిడీలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పొందవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 8978988002, 9490684344 నంబర్లకు సంప్రదించవచ్చని వివరించారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బీ బ్లాక్ మూడవ అంతస్తులోని ఈనాడు ఆఫీస్ వేదికగా నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతోపాటు సంబంధిత కుటుంబీకులు నేడు (28 సెప్టెంబర్ 2024, శనివారం), రేపు (29 సెప్టెంబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 80080 01686 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

★ **ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు.** రిజిస్ట్రేషన్ చేయదలిచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

నేడు మున్సిపల్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : విజయవాడ, మచిలీపట్నం నగర పాలక సంస్థలతోపాటు గుడివాడ పురపాలక సంఘం పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు శనివారం మచిలీపట్నంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో తాహెరా సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగోన్నతులు, రివర్షన్‌కు ఉదయం 10.30గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభిస్తామన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు అందరూ హాజరు కావాలని కోరారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన సదస్సులు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా శనివారం అన్ని లేఔట్లలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం క్షేత్రస్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో 2025 మార్చి నాటికి నిర్దేశిత గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ప్రతిభావంతులకు రూ. 1.5 కోట్ల ఉపకార వేతనాలు

కానూరు, న్యూస్‌టుడే : వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ డీమ్డ్ టు బీ విశ్వవిద్యాయంలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు రూ. 1.50 కోట్ల ఉపకార వేతనాలు అందించినట్లు సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణ రావు తెలిపారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డుల్లో భాగంగా ఇంటర్, జేఈఈ, ఎస్ఈఈటీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఈ ఉపకార వేతనాలకు ఎంపిక చేశామన్నారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన మొదటి సంవత్సరంలో ఇటువంటి కార్యక్రమం ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. మొత్తం 485 మంది విద్యార్థులకు రూ. 1,50,90,000 అందించామన్నారు. ప్రతి ఏడాది ఈ స్కాలర్‌షిప్‌లలో అర్హత పొందాలంటే కనీసం 7.5 సీజీపీఏ, 75శాతం హాజరున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి పి. వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎమ్.రవిచంద్, ఏవో సాయిబాబు, డీన్ బావినేని పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, వైస్‌ఛాన్సలర్ పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ రత్నప్రసాద్

దేశంలో బలమైన శక్తిగా కాంగ్రెస్: గిడుగు రుద్రరాజు

డీసీసీ అధ్యక్షుడిగా కృష్ణ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే : దేశంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా అవతరించిందని, లోక్‌సభలో 230 మంది ఎంపీలతో బలంగా ఉందని పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడిగా గొల్లు కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిడుగు రుద్రరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమ్ము కశ్మీర్, హరియాణా, మహారాష్ట్రల్లోనూ మంచి ఫలితాలతో అధికారం చేజిక్కించుకోనుందన్నారు. ఏపీలోనూ ప్రజల ఆలోచనా సరళి కాంగ్రెస్‌కు అనుకూలంగా మారుతోందన్నారు. రాష్ట్రంలో అధికారంలో పాలుపంచుకున్న తెదేపా, జనసేన నేడు విశాఖ ఉక్కును గాలికొదిలేశాయని విమర్శించారు. గొల్లు కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్‌కు గత వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ధనేకుల మురళీమోహనరావు, వింత సంజీవరెడ్డి, నరహరశెట్టి నరసింహారావు, మువ్వ మోహనరావు, మచిలీపట్నం ఇన్‌ఛార్జి అబ్దుల్‌మతీన్, కోకె పవి భూషణ్, సుధాకర్, చంద్రశేఖర్ తదితరులు డీసీసీ అధ్యక్షుడిని సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర నాయకులకు ఘన స్వాగతం పలికారు.


డీసీసీ అధ్యక్షుడు కృష్ణను సత్కరిస్తున్న రుద్రరాజు, కాంగ్రెస్ నాయకులు

విజయ డెయిరీ వ్యవహారంలో ప్రతిష్టంభన

❖ రాజీనామాకు సిద్ధపడ్డ చలసాని ❖ పార్టీ ఆదేశాలతో వాయిదా

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: విజయ డెయిరీ ఛైర్మన్‌గా చలసాని ఆంజనేయుల్ని కొనసాగిస్తారా, లేదా అన్న విషయంలో సందిగ్ధం నెలకొంది. తక్షణమే ఆయన్ను రాజీనామా చేయాల్సిందిగా ఉమ్మడి జిల్లాకు చెందిన తెదేపా కీలక నేతలు గురువారం సూచించినట్లుగా జోరుగా ప్రచారం జరిగింది. ఇదే అంశం మీద విజయవాడలోని ఓ హోటల్‌లో ఆంజనేయులుతో పాటు, విజయ డెయిరీ డైరెక్టర్లందరితో సమావేశం ఏర్పాటు చేసి రాజీనామా అనివార్యమని చెప్పినట్లుగానూ, డైరెక్టర్లు కొంతకాలం కొనసాగించాలని విజ్ఞప్తి చేసినట్లుగా సమాచారం. చంద్రబాబు నిర్ణయం ప్రకారం తాను నడుచుకుంటానని చలసాని, పార్టీ నేతలకు చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. చలసాని సన్నిహితులు కూడా దాదాపుగా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇటీవల వరదలకు విజయవాడలోని పాత ఫ్యాక్టరీ ముంపునకు గురై మూతపడిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఇందులో కొన్ని విభాగాల్లో ఉత్పత్తి ప్రారంభించేలా ఏర్పాట్లు చేసిన అనంతరం విలేకర్ల సమావేశంలో, రాజీనామా ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే డైరెక్టర్లు, జిల్లాలోని వివిధ పాల సంఘాల అధ్యక్షులు ఇక్కడకు తరలివచ్చారు. కానీ విలేకర్ల సమావేశం లేకుండానే కార్యక్రమం ముగిసిపోయింది. దీనిపై స్పందించేందుకు కూడా ఆయన సుముఖత చూపలేదు. మరోవైపు గురువారం రాత్రే చలసాని తన రాజీనామా పత్రాన్ని ఒక మంత్రికి అందజేశారనే ప్రచారం కూడా జరిగింది. పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన సూచనల మేరకే రాజీనామా ప్రకటన ఆగిందని, ఇది తాత్కాలికమా, లేక డైరెక్టర్లంతా కోరిన విధంగా రెండేళ్ల పాటు ఆంజనేయుల్ని కొనసాగిస్తారా అన్న విషయం తేలాల్సి ఉంది.

సౌర విద్యుత్తు కుళాయికి సుస్తీ


ప్రాజెక్టు చుట్టూ పిచ్చిమొక్కలు

ఉంగుటూరు మండలం తేలప్రోలు దళితవాడలో 2014లో తెదేపా ప్రభుత్వం సౌరవిద్యుత్తు కుళాయిని ఏర్పాటు చేసింది. 2019లో ప్రభుత్వం మారిన నుంచి అధికారులు కనీసం పట్టించుకోలేదు. దీంతో ఈ నమూనా ప్రాజెక్టు పడకేసింది. సౌరవిద్యుత్తు పలకలు, ట్యాంకు పరిసరాల్లో మొక్కలు కమ్మేయడంతో సూర్య కిరణాలు సరిగా పడక కుళాయికి నీరు రాని దుస్థితి. కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టును పునరుద్ధరించి తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– తేలప్రోలు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే


తుప్పు పట్టి ఇలా..

వాహనం విలువ చెల్లించాలని కమిషన్ తీర్పు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : వాహనం విలువ చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పింది. కమిషన్ కార్యాలయం వెల్లడించిన వివరాల మేరకు అవనిగడ్డకు చెందిన కె.కిషోర్‌బాబు ఎన్.వెంకటరమణ అనే వ్యక్తి వద్ద సెకండ్ హ్యాండ్ మోటారు సైకిల్ కొనుగోలు చేశారు. వెంటనే ఆర్‌సీ ఆయన పేరిట మార్పించుకున్నారు. కొన్ని కారణాలతో బీమా మార్పించుకోవడం కుదరలేదు. కొన్నాళ్ల తరువాత ఆ వాహనాన్ని అవనిగడ్డలోని అతని ఇంటి వద్ద ఉంచి వ్యక్తిగత పనిపై రాజమహేంద్రవరం వెళ్లి నెల రోజులు ఉండాల్సి వచ్చింది. తరువాత ఇంటికి వచ్చి చూస్తే వాహనం కనిపించలేదు. ఈ నేపథ్యంలో బీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే బీమా కిషోర్‌పేరిట మారని కారణంగా పరిహారం ఇవ్వడం కుదరదని చెప్పడంతో ఆయన వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ నిర్వహించిన కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు శ్రీలక్ష్మి రాయల వాహనం కిశోర్ పేరిట మారినందున బీమా నిబంధనల ప్రకారం రూ.34,181లు వడ్డీతో ఫిర్యాదుదారుడికి చెల్లించాలని తీర్పు చెప్పారు. దీంతోపాటు అతడికి మానసిక వేదన కలిగించినందుకు రూ.10వేలు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఇవ్వాలని సంబంధిత బీమా సంస్థను ఆదేశించారు.

డైట్ విద్యార్థినుల హాస్టల్ వద్ద ఆకతాయిల హల్‌చల్

రాత్రి వేళ ఘటనతో భయాందోళనలో విద్యార్థినులు

అంగలూరు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: అంగలూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో గురువారం రాత్రి కళాశాల విద్యార్థినుల వసతిగృహం వద్ద ఆకతాయిలు హల్‌చల్ చేయడంతో విద్యార్థినులు ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో వార్డెన్, రాత్రి కాపలాదారు లేకపోవడంతో విద్యార్థినులు కంగారు పడ్డారు. దీనిపై శుక్రవారం కళాశాల, హాస్టల్‌లో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ విచారణ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలనలో భాగంగా బాలికల వసతిగృహాలను వారం రోజుల కిందట ఎమ్మెల్యే రాము పీఏ సుజిత ఈ వసతిగృహాన్ని పరిశీలించడం గమనార్హం. డైట్ విద్యార్థినుల కోసం బీసీ సంక్షేమ శాఖ కళాశాల ఆవరణలోనే బీసీ కళాశాల విద్యార్థినుల వసతిగృహం నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి భోజనాల అనంతరం ఒక విద్యార్థిని వాష్‌రూంకు వెళ్తుండగా వసతి గృహం బయట ఆకుల చప్పుడు, నడుస్తున్నట్లు అనిపించింది. సిమెంట్‌గ్రిల్స్ నుంచి బయటకు చూడగా ఒక యువకుడు ఉన్నట్లు భావించి ఆమె కేకలు వేయగా మిగిలిన కొంత మంది అక్కడికి రావడంతో వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీనిపై హాస్టల్‌లో ఉన్న కేర్‌టేకర్ వార్డెన్‌కు, ప్రిన్సిపల్‌కు తెలియపర్చడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే సమయంలో ఎవరో వసతిగృహం ప్రధాన తలుపులను గట్టిగా బాదినట్లు వినిపించడంతో మరింత భయాందోళనకు గురయ్యారు. ఆ తర్వాత పోలీసులు, వార్డెన్, రాత్రి కాలపాలదారు రావడంతో విద్యార్థినులు విషయాన్ని వారికి వివరించారు. హాస్టల్ పరిసరాలను తనిఖీ చేయగా ఎవరూ కానరాలేదు. శుక్రవారం కళాశాలలో హాస్టల్ విద్యార్థినుల చరవాణులు, గదులను ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, వార్డెన్‌లు తనిఖీ చేశారు. రాత్రిళ్లు బీట్ కానిస్టేబుల్స్ వసతిగృహం వద్దకు వచ్చి పరిశీలన చేయాలని ప్రిన్సిపల్ కోరడంతో పోలీసులు సమ్మతించారు. విద్యార్థులు చీకట్లో కంగారుపడ్డారని, కళాశాల, హాస్టల్ ఆవరణలోకి ఎవరూ వచ్చే అవకాశం లేదన్నారు. వాస్తవానికి హాస్టల్‌కు నైట్‌వాచ్‌మెన్ లేరు. తాత్కాలికంగా నియమించుకున్న ఉద్యోగి ఉన్నారు. ప్రహరీ కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా తిరిగి నిర్మించకపోవడంతో వసతిగృహం పక్కనే డ్రెయిన్‌గట్టు నుంచి ఎవరైనా లోపలికి వచ్చే ఆస్కారం ఉంది.

ప్రధానోపాధ్యాయిని రవీంద్రభవానీ సస్పెన్షన్

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని రవీంద్ర భవానీని సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ రీజనల్ జేడీ జి.నాగమణి ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల ఆవరణలోని జూనియర్ బాలికల కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులతో దురుసుగా ప్రవర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డీవైఈవో, ఎంఈవో బృందం విచారణ చేపట్టింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఇష్టానుసారంగా మాట్లాడి.. పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం గురించి ఆమెను ఆరా తీశారు. ఇరు వర్గాల వాదనలు విన్న విచారణ కమిటీ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించింది. దీంతో తొలుత శాఖాపరమైన చర్యల్లో భాగంగా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ఆ ఉపాధ్యాయుడు మాకొద్దు : గ్రామస్థుల ఫిర్యాదు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జైపాల్ మాకు వద్దంటూ గుడివాడ మండలం శేరీ దింటకుర్రు గ్రామస్థులు మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి, మండల విద్యాశాఖాధికారికి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయుడు సకాలంలో పాఠశాలకు రావడం లేదని, పిల్లలకు సరిగా బోధించడం లేదని.. తక్షణం అతడ్ని తొలగించి మరో ఉపాధ్యాయుడ్ని నియమించాలని కోరుతూ అధికారులను కోరారు.

సిటీ బస్ కిందపడి యువకుడి మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే : సిటీ బస్ బస్ కిందపడి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పోరంకి సుగాలి కాలనీకి చెందిన బాణావత్ సైదులు (22) స్థానికంగా ఓ టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తుంటారు. 20 రోజుల కిందట ద్విచక్ర వాహనం కొనుగోలు చేశారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో తన వాహనంపై తాడిగడప హైస్కూలు వద్ద నుంచి తాడిగడప కూడలికి వస్తున్నారు. కొంతదూరం వెళ్లే సరికి ముందు వెళ్తున్న సిటీ బస్‌ను ఎడమ వైపు నుంచి తప్పించే ప్రయత్నంలో రహదారి అంచుల్లో ఉన్న బురదలోకి బైక్ అదుపు తప్పింది. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి బస్ ముందు చక్రాల కింద పడటంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెడన-విస్సన్నపేట జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కానుమోలు-ఆరుగొలను గ్రామాల సరిహద్దులో అతను నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతను ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. ప్రమాదానికి ముందు అతను ఆరుగొలను కూడలిలో రోడ్డు మధ్యలో అడ్డదిడ్డంగా నడవటం చూసి తాము వారించినట్లుగా కొందరు గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. ఎస్సై జనార్ధన్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగికి జైలు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ లంచం తీసుకున్న కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన మోకరాల శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ కోలం ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన నరసింహారెడ్డి.. రికార్డుల నిర్వహణ సరిగా లేని కారణంగా వారంపాటు సస్పెన్షన్‌కు గురయ్యారు. తదుపరి ప్రాజెక్టు డైరెక్టర్ అతడి సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ ఆ వారం రోజులను ఎర్నెడ్ సెలవుల కింద పరిగణించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయాలని 2009, ఏప్రిల్ 13న ఉట్నూర్‌లోని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మోకరాల శ్రీధర్‌ను నరసింహారెడ్డి ఆశ్రయించగా రూ.మూడు వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో నరసింహారెడ్డి 2009, ఏప్రిల్ 23న ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా అనిశా ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్.. రూ.3 వేల లంచం తీసుకున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. తదుపరి ఇన్‌స్పెక్టర్ మోహన్.. కోర్టులో ఈ మేరకు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిషోర్‌కుమార్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి కుమార్ వివేక్ శుక్రవారం శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు నమోదు చేసినప్పుడు శ్రీధర్ వయసు 56 సంవత్సరాలు. ప్రస్తుతం 70 ఏళ్ల వయసులోనూ ఆయనకు శిక్ష తప్పకపోవడం గమనార్హం.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్ ఎస్ఈ రమణారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధర్, మొక్క ఇస్తున్న జిల్లా రవాణా అధికారిణి మనీషా

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లాకు బదిలీపై వచ్చిన పలువురు అధికారులు కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం పంచాయతీరాజ్ ఎస్ఈ వీవీ రమణారావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధర్, జిల్లా రవాణా అధికారిణి జి.మనీషా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందజేశారు. వారితో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి.భార్గవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎస్.విద్యాసాగర్, పంచాయతీరాజ్ ఈఈ సుధాకర్‌గౌడ్, తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ వారికి సూచించారు.

ఉద్యోగ మేళాలో 20 మందికి కొలువు



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో అధికారులు

పోతేపల్లి(మచిలీపట్నంగ్రామీణ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పోతేపల్లి ఇమిటేషన్ జ్యువెలరీ పార్క్‌లో జాబ్‌మేళా నిర్వహించారు. పలు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 112 మంది హాజరు కాగా 20 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, సీడాప్ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సూర్యనారాయణ, ఇమిటేషన్ జ్యువెలరీ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అంకెం జితేంద్రకుమార్, సిబ్బంది కె.దిలీప్, ఎ.వి.బాబు, రాహుల్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, విద్యా శాఖ ఏడీ అజీజ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో అవసరం మేర సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. అర్హులైన వారిని పట్టణ ఎంఈవోలుగా నిమమించాలన్నారు. అక్టోబరు 2న అన్ని పురపాలక సంఘాల్లో సత్యాగ్రహ దీక్ష చేపడతామన్నారు. నాయకులు కేపీ ఉమామహేశ్వరరావు, లెనిన్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష సాయం



ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది శుక్రవారం వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కాకి కుమారబాబు, ప్రిన్సిపల్ డా.టీఆర్ఎస్ రెడ్డి, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ వి.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనం.. అవస్థలమయం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నాడు.. నేడు కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలలను ఆధునికీకరించామని చెబుతూ వచ్చిన వైకాపా ప్రభుత్వం అనేక పాఠశాలల్లో చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాజాగా ఈ పనులపై మంత్రి నారా లోకేష్ సమీక్షించడంతో, త్వరలోనే మిగిలిన పనులు చేపట్టే అవకాశం ఉందని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బందరు మండలం బైరాగిపాలెంలో పూర్తి కాని భవనం



వలందపాలెం జెడ్పీ బాలికల విద్యాలయంలో పునాదుల దశలో నిలిచి ఇలా..

ఇరుక్కొని కూర్చోవాల్సిందే..

మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు కూర్చునేందుకు సరైన భవనాలు లేక అవస్థలు పడుతున్నారు. చిలకలపూడి మున్సిపల్ పాండురంగ ఉన్నత పాఠశాలలో 800 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. సరిపడా భవనాలు లేక విద్యార్థులు ఉన్న గదుల్లోనే ఇరుక్కొని కూర్చోవాల్సి వస్తోంది. సమగ్రశిక్ష ద్వారా భవన నిర్మాణాలకు రూ.36లక్షలు కేటాయించగా, దాతలు రూ.కోటికిపైగా ఇచ్చేందుకు ముందుకు రావడంతో పనులు ప్రారంభించారు. కానీ భవనం నిర్మించే ప్రదేశంపై కొందరు కోర్టుకు వెళ్లడంతో పనులు పునాదుల్లోనే ఆగిపోయాయి. కేటాయించిన నిధులు కూడా వైకాపా హయాంలోనే ఇతర పాఠశాలలకు మళ్లించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

❖ దేశాయిపేట హైస్కూల్లో 700లకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో చేపట్టిన భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు.

మండలం	ఎంపికైన పాఠశాలలు	చేపట్టిన పనులు	పూర్తయినవి	చేయాల్సినవి
బందరు	59	166	95	71
పెడన	26	99	60	39
గూడూరు	17	55	24	31
బంటుమిల్లి	21	64	36	28
కృత్తివెన్ను	20	81	72	09
మొత్తం	143	465	287	178

❖ రైల్వేపేట ప్రాథమికోన్నత పాఠశాలకు ఉన్నత పాఠశాలగా వర్గోన్నతి కల్పించారు. ఇక్కడ ప్రస్తుతం ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఓ భవన నిర్మాణం ప్రారంభించినా పూర్తికాకుండానే ఆగిపోయింది. ముస్తాబాద బాలికల పాఠశాలలో కూడా నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. టీటీ బాలికల విద్యాలయంలో భవనం పునాదుల దశలోనే నిలిపివేశారు.

అన్ని చోట్లా అంతే: బందరు నగరమే కాదు మండల పరిధిలోని అనేక పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. తపశిపూడి, ఎస్ఎన్‌గొల్లపాలెం, బైరాగిపాలెం తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి.

❖ పూర్తికాని పాఠశాలల పనులు

❖ గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణ పనులు చివరి దశలో ఆగాయి. ఆకులమన్నాడు పాఠశాలలో చేపట్టిన భవనమూ అలాగే ఉంది. బంటుమిల్లి మండలంలోని పెందుర్రు, బంటుమిల్లి గవర్నమెంట్ తదితర పాఠశాలల్లో పనులు ఆగిపోయాయి. బందరు, పెడన నియోజకవర్గాల పరిధిలో అనేక పాఠశాలల్లో అదనపు భవనాల నిర్మాణం ఆగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

త్వరలోనే ప్రారంభిస్తాం



నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఆగిపోయిన అదనపు తరగతి భవనాల పనులు త్వరలోనే తిరిగి ప్రారంభించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా తగు చర్యలు తీసుకుంటోంది. చిన్న చిన్న పనులు ఉన్న నిధులు బట్టి చేస్తున్నారు. సమగ్రశిక్ష ద్వారా ఇతర పాఠశాలల్లో ఉన్న నిధులు అత్యవసరం ఉన్న చోటుకు బదలాయించి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. ఈ పనులపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

- శేఖర్‌సింగ్, డీవైఈవో, మచిలీపట్నం

రోజుల వ్యవధిలోనే నష్ట పరిహారం

గోపు సత్యనారాయణ



28వ డివిజన్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు, అధికారులు



మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్



మాట్లాడుతున్న గోపు సత్యనారాయణ

మంగినపూడి(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే : వరదలకు పంట నష్టపోయిన రైతులకు రోజుల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందజేయడం అన్నదాతలపై ప్రేమను చాటుతోందని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మంగినపూడి, తపసిపూడి గ్రామాల్లో శుక్రవారం జరిగింది. తెదేపా మండల అధ్యక్షుడు కుంచె నాని, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి లంకే శేషగిరి, తెదేపా నాయకులు తలారి సోమశేఖర్, సిరివెళ్ళ సాంబయ్య, మెండు భానుమూర్తి, నాగు, శ్రీపతి నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం.. ప్రతి ప్రాంతం అభివృద్ధి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని కూటమి నాయకులు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని వివిధ డివిజన్‌లలో ప్రజావేదిక సభలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, తెదేపా నాయకులు గొర్రెపాటి గోపీచంద్, అక్కు మహంతిరాజా, కూటమి నాయకులు ఫరూక్, కొట్టే వెంకట్రావు, ఇలియాస్ పాషా, నగరపాలక సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనకళ్లకు అభినందన



నారాయణరావును అభినందిస్తున్న తెదేపా నాయకులు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన పార్లమెంటు మాజీ సభ్యుడు కొనకళ్ల నారాయణరావును మచిలీపట్నంలోని ఆయన నివాసంలో మండలానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం కలసి అభినందనలు తెలిపారు. తెదేపా నాయకులు గుడిసేవ రామారావు, నందమూరు మాజీ సర్పంచి పరసా రాంబాబు, కాగిత వాసు, పామర్తి వెంకటేశ్వరరావు, నందమూరు సీతారామయ్య, పేరం రాజు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావు, అతని సోదరుడు జగన్నాథరావు(బుల్లయ్య)ను గూడూరు తెదేపా నాయకులు మచిలీపట్నంలో పూలదండలతో సత్కరించి అభినందనలు తెలిపారు. తెదేపా మండల అధ్యక్షులు పోతన లక్ష్మీనరసింహస్వామి, నాయకులు కట్టా మునేశ్వరరావు, ఎన్ఏబేగ్, శాయన సోమయ్య, పోతుల రాము, కాట్రగడ్డ సత్యనారాయణ, వాకా శ్రీను, బాసంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు అభినందనలు తెలియజేసినవారిలో ఉన్నారు.

మచిలీపట్నం(కోనేరుసెంటరు): ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. కొనకళ్లను ఆయన నివాసగృహంలో శుక్రవారం పెనమలూరు నియోజకవర్గ నాయకులతో కలిసి ఘనంగా సత్కరించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, నాయకులు

పెడన, న్యూస్‌టుడే : ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కొమరగిరి చంద్రశేఖరరావు, అనుమకొండ గౌరీ ప్రసాద్, వీడీ శివప్రసాద్, కేడీఎన్‌వీ ప్రభాకర్, వీడీ నవీన్ తదితరులు కొనకళ్లను కలిసి సత్కరించారు.

వ్యర్థాలతో కళాకృతులు

పెందుర్రు(బంటుమిల్లి), న్యూస్‌టుడే: మండలంలోని పెందుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ వ్యర్థాలతో మానవాళికి ఉపయోగపడే కళాకృతులు తయారు చేసే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయిని దాసరి అరుణ్‌కుమారి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో నిర్వహించారు. మొత్తం 15 కళాకృతులు తయారు చేయించారు. ప్రదర్శనలో ముగ్గురు బాలికలను ఎంపిక చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఉషశ్రీ ప్రథమ బహుమతి సాధించిందన్నారు. మండల స్థాయిలో శనివారం నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు.



ఉషశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అల్జీమర్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ ఎన్‌వీ సుందరాచారి, మాజీ ప్రిన్సిపల్ కె.విజయకుమారి, ఎన్ఆర్ఐ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శివప్రమోద్, ఆచార్యులు అరుణ, గీతావాణి తదితరులు పాల్గొని అల్జీమర్స్ వ్యాధి లక్షణాలు, చికిత్స, అందుబాటులోకి ఆధునిక పరిజ్ఞానం తదితర అంశాల గురించి వివరించారు. వైద్యులు కిరణ్మయి, ప్రదీపా కళాశాల బయోకెమిస్ట్రీ విభాగ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న వైద్యులు, పక్కన ప్రిన్సిపల్ సుందరాచారి తదితరులు

మున్సిపల్ టీపీవోగా బాధ్యతల స్వీకరణ

పెడన, న్యూస్‌టుడే: మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో)గా బళ్ల సృజన కుమారి శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. పట్టణంలోని 9 వార్డు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, ఉద్యోగులు నూతన టీపీవోకు స్వాగతం పలికారు.



టీపీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్లానింగ్ కార్యదర్శులు

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత



కోర్టు ప్రాంగణంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న జిల్లాజడ్జి అరుణసారిక, న్యాయమూర్తులు



ర్యాలీలో విద్యార్థులు



పెడన 21వ వార్డులో ప్రదర్శన

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా జడ్జి అరుణ సారిక అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కోర్టులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు పలువురు న్యాయమూర్తులు కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. న్యాయమూర్తులు చిన్నంశెట్టి రాజు, చినబాబు, సుజాత, ఎ.పద్మ, కె. అరుణ, దేవి సాయిశ్రీవాణి, ఎన్.మేరి తదితరులు పాల్గొన్నారు. ఉదయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హిందూకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, నగరపాలక సంస్థ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెడన, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని 21, 22 వార్డుల్లో అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కౌన్సిలర్ పిచ్చుక సతీష్, మాజీ కౌన్సిలర్ యర్రా రాజా, నేతలు యర్రా నాగేంద్రం, మేడక కిషోర్ పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ ఆదర్శంగా ఉందామన్నారు.

ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోంది

గూడూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు అన్నారు. శుక్రవారం గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలుర జట్ల ఎంపిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని మండలాల నుంచి మొత్తం 310 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నట్లు పోటీల నియోజకవర్గ సమన్వయకర్త మురళి తెలిపారు. తెదేపా మండల అధ్యక్షులు పోతన లక్ష్మీనరసింహస్వామి, నాయకులు గోపినాగబాబు, ఎన్ఏబేగ్, మాజీ సర్పంచి పోతన రామోజీ, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు పోతన కృష్ణారావు తదితరులతోపాటు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

పెడన, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని స్థానిక బీజీకే జడ్పీ హైస్కూలు హెచ్ఎం బళ్ల తీర్థావతి అన్నారు. రీజనల్ సైన్స్ సెంటర్, తిరుపతికి చెందిన మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ వాహనం శుక్రవారం పెడనకు చేరుకుంది. వాహనం హైస్కూలు ఆవరణలో శనివారం వరకు ఉంటుందని హెచ్ఎం తెలిపారు. పలు విద్యాసంస్థల విద్యార్థులు మొబైల్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. సైన్స్ ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, ఎంఈవో-2 హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : విధులనుంచి తొలగించిన కార్మికుడిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలంటూ మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో విధులు నిర్వహించే ఫణీంద్ర అనే కార్మికుడిని అకారణంగా విధుల నుంచి తొలగించడంతోపాటు అతనిపై అక్రమ కేసుల బనాయించారంటూ పలువురు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ వచ్చేవరకు కదిలేది లేదంటూ ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. ఏఐటీయూసీతో పాటు వివిధ సంఘాల నాయకులు వారికి మద్దతు పలికారు. కాంట్రాక్టర్ వచ్చే వరకు నిరసన కొనసాగిస్తామని, అవసరమైతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.



నిరసనలో పాల్గొన్న కార్మికులు

తాగునీటి సమస్య పరిష్కారానికి విరాళం

పెడన, న్యూస్‌టుడే: పెడనకు చెందిన విశ్రాంత అధికారి మట్టా రాధాకృష్ణమూర్తి స్థానిక బీజీకే హైస్కూల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.20వేల విరాళాన్ని అందజేశారు. దాదాపు 900లకు పైగా విద్యార్థులున్న ఈ పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలుసుకున్న ఆయన సాయాన్ని హెచ్ఎం బళ్ల తీర్థావతికి అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో పది ఫలితాల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తానని ఆయన పేర్కొన్నారు.

రాజారామ్‌మోహన్‌రాయ్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పల్లెపాలెం(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: రాజారామ్‌మోహన్ రాయ్ బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలను వ్యతిరేకించి వాటిని రూపు మాపడంలో కీలకపాత్ర పోషించారని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కొప్పినీడి సూర్య ప్రకాష్ కొనియాడారు. మండలంలోని లక్ష్మీపురం పల్లెపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజారామ్‌మోహన్‌రాయ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు విజయకుమార్, మారగాని ఏసుబాబు, నడకుదిటి మురళీకృష్ణ, జి.రాజ్యలక్ష్మి, జె.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అతి వేగం.. అదుపు తప్పిన వాహనం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : అదుపు తప్పి పై వంతెన నుంచి లారీ దిగువకు దూసుకెళ్లిన ఘటన మచిలీపట్నంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు మచిలీపట్నం శివారు హర్ష కళాశాల ప్రాంతంలోని పై వంతెన ఎక్కే సమయంలో లారీ అదుపు తప్పి దిగువకు దూసుకెళ్లిపోయింది. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వేగంగా నడపడంతో వాహనం మలుపు తిరగక దిగువకు వెళ్లి పోయిందని చూసిన వారు చెబుతున్నారు. ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. బందరు తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.



దిగువకు దూసుకెళ్లి ఆగిన లారీ

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి

పెడన, న్యూస్‌టుడే: స్థానిక రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. బల్లిపర్రు కాలనీకి చెందిన సముద్రాల శివశంకర్(41) మచిలీపట్నంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నారు. ఆయన సొంతూరు నెల్లూరు జిల్లా కోవూరు మండలం చినపిడుగుపాడు వెళ్లి తిరిగి వస్తూ పెడన రైల్వేస్టేషన్‌లో ఉదయం 4గంటల సమయంలో దిగారు. పార్కింగ్‌లో ఉన్న బైక్ తీసుకుని ఇంటికి వెళ్తుండగా స్టేషన్ ఆవరణలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెపోటుతో మృతిచెంది ఉంటారని భావించిన రైల్వే పోలీసులు పెడన పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తరలించారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు. శివశంకర్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మూడేళ్ల కిందట సొంతూరు నుంచి పెడనకు వచ్చి ఇక్కడే స్థిరపడినట్లు ఏఎస్సై సురేష్‌కుమార్ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించారంటూ ఫిర్యాదు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే : సర్వజనాసుపత్రిలో విధులు నిర్వహించేందుకు వచ్చిన తనతో సహచర కార్మికులు పథకం ప్రకారం అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు చీర లాగి తీవ్ర మనోవేదనకు గురిచేశారంటూ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని వివరాల మేరకు మహిళలతో అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు ఎం.ఫణీంద్రను పై అధికారులు విధుల నుంచి సస్పెండ్ చేయడానికి తానే కారణమన్న అపోహతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత సఫాయి మజ్దూర్ కాంగ్రెస్‌తో పనిచేస్తున్నానన్న అక్కసుతో శుక్రవారం ఉదయం విధులకు వచ్చిన తనతో అసభ్యంగా ప్రవర్తించారన్నారు. పారిశుద్ధ్య విభాగ ఇన్‌ఛార్జి చక్రవర్తి కనుసన్నల్లో ఫణీంద్రకు మద్దతుగా దుర్గాప్రసాద్, కమల, దుర్గ, లక్ష్మి, వెంకటలక్ష్మిలు తనను కులం పేరుతో దూషించారన్నారు. మహిళా స్టేషన్ పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ట్రక్కు పల్టీ.. ఒకరికి గాయాలు

పెడన, న్యూస్‌టుడే: మండలంలోని నందమూరు వద్ద జాతీయ రహదారి 216పై శుక్రవారం ట్రాక్టర్ ట్రక్కు పల్టీ కొట్టిన ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. నందమూరు పెట్రోల్ బంకు నుంచి ద్విచక్ర వాహనంపై రహదారి వైపు వస్తున్న వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి ట్రాక్టర్ వెనుక ఉన్న ట్రక్కు పల్టీ కొట్టింది. ట్రక్కులో ఉన్న మట్టి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై పడటంతో అతనికి గాయాలయ్యాయి. పెదనందమూరు గ్రామానికి చెందిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

పవన్‌కల్యాణ్‌కు పేర్ని నాని క్షమాపణ చెప్పాలి

కానూరు, కంకిపాడు, కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కూటమి నాయకులు శుక్రవారం కానూరు సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ముప్పారాజా, తాతపూడిగణేష్ మాట్లాడుతూ క్షమాపణ చెప్పకుంటే జనసైనికుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో తెదేపా నేతలు వెలగపూడి శంకరబాబు, దోనేపూడి రవికిరణ్, అంగిరేకుల మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గురువారం రాత్రి కంకిపాడు బస్టాండ్ కూడలిలో కూటమి నాయకులు పేర్ని నాని దిష్టిబొమ్మను దహనం చేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పారాజా, తెదేపా జిల్లా ప్రతినిధి బొర్రా వెంకట్ డిమాండ్ చేశారు. పోలీసులు ఆందోళనకారులను పంపించేశారు. పేర్ని నాని తన భాషతోపాటు పద్ధతిని కూడా మార్చుకోవాలని వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, నూర్‌బాషా ముస్లిం సంక్షేమసంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.చిన్నా సూచించారు.



నాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కూటమి నేతలు

సీహెచ్‌సీ అభివృద్ధికి కృషి



సీహెచ్‌సీలో హడ్కో సంస్థ వితరణతో ఇచ్చిన వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తదితరులు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. శుక్రవారం కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ రంగసంస్థ హడ్కో వితరణతో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను సంస్థ జీఎం కె.విజయ్‌కుమార్, సీనియర్ మేనేజర్ సుబ్బారావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో తెదేపా నాయకులు, వైద్యబృందంతో కలిసి మొక్కలు నాటారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంజయ్, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, తెదేపా మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, ఆసుపత్రి మాజీ ఛైర్మన్ వై.కిషోర్‌బాబు, తుమ్మలపల్లి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పునాదిపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

ఇది మంచి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పునాదిపాడులో స్థానిక తెదేపా నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ నిర్వహించారు. స్థానిక నాయకుడు మద్దాలి సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో తెదేపా 100 రోజులపాలనలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వ్యాయామ విద్యలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రతి వ్యాయామోపాధ్యాయుడు వ్యాయామ విద్యలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని నెప్పల్లి జడ్పీపాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి అండర్-14, 17 బాలురు, బాలికల కబడ్డీ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాలికల అండర్- 14 విభాగంలో కోలవెన్ను, కంకిపాడు జడ్పీహెచ్ పాఠశాలల విద్యార్థులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. అండర్ -17 బాలికల విభాగంలో కంకిపాడు, కోలవెన్ను విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మండల క్రీడాధికారి ఎం.హరగోపాల్, సబ్‌జోన్ ప్రతినిధులు భవాని, మురళి, పెనమలూరు సబ్‌జోన్ కోఆర్డినేటర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



వ్యాయామోపాధ్యాయ సిబ్బందితో ఆర్ఐపీఈ అధికారి మహబూబ్‌బాషా

శ్రీరామలింగేశ్వరాలయం ఈవోగా భవాని

యనమలకుదురు(పెనమలూరు), న్యూస్‌టుడే : యనమలకుదురు శ్రీరామలింగేశ్వరాలయ (గ్రూపు) దేవాలయాల కార్యనిర్వహణాధికారిగా నాగినేని భవాని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవస్థానం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న గంగాధరరావు నందిగామ శ్రీరామలింగేశ్వరాలయానికి బదిలీ అయ్యారు.



గంగాధరరావు నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న భవాని

రూ. కోట్లు ఖర్చయినా కష్టాలు తొలగలేదు

అధ్వానంగా నాగన్నగూడెం జగనన్న లేఔట్

చినుకుపడితే చెరువే

ఉయ్యూరు, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ఎకరాల కొద్దీ భూములు కొని ఇళ్ల స్థలాలిచ్చినా వాటిలో కనీస సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చడంలో తీవ్రంగా విఫలమైంది. అందుకు నిదర్శనంగా నేడు జనగన్న కాలనీల్లో నిర్మాణాలు ముందుకు సాగక చతికిల పడ్డ పరిస్థితి కళ్లెదుట కనిపిస్తోంది. గత ప్రభుత్వం మెరక, రోడ్లకు రూ. కోట్లు ఖర్చు చేశామని ప్రకటించుకున్నా నేడు ఆయా కాలనీల్లో కాలు పెట్టేందుకు కూడా అవకాశం లేకపోవడం గమనార్హం.

☛ ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో నాగన్నగూడెం, ఎగినిపాడు శివారు ప్రాంతాల్లో జనగన్న కాలనీ లేఔట్లు వేశారు. నాగన్నగూడెం పరిధిలో 2004, ఎగినిపాడు ప్రాంతంలో 432 మందికి పట్టాలు పంపిణీ చేశారు. నాగన్నగూడెంలో సుమారు 50 ఎకరాలు స్థలాన్ని రూ. కోట్లతో కొనుగోలు చేశారు. ఆ లేఔట్‌లో ఇప్పటికీ రోడ్లు సరిగా లేవు. ఏదో నామ్‌కే వాస్తేగా రోడ్లపై రబ్బీషు పర్చి చేతులు దులుపుకొన్నారు.

☛ సదరు లేఔట్‌లో మెరక చేయడానికి, రోడ్లు వేయడానికి రూ. 9.40 కోట్ల నిధులు కేటాయించారు. వాటితో పనులు చేశారు. నాలుగు ప్రధాన రహదారులుండగా మరో 45కు పైగా అంతర్గత రహదారులున్నాయి. ఆయా రోడ్లన్నీ నేడు చినుకు పడితే చెరువులా తయారవుతున్నాయి. ప్రస్తుతం కొంత మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని అక్కడ నివాసముంటున్నారు.

☛ ప్రధాన రహదారులు వర్షం వస్తే చిత్తడి చిత్తడిగా తయారై వాహనం వెళితే జారిపడే పరిస్థితి, ఇక అంతర్గత రహదారుల పరిస్థితి అత్యంత అధ్వానం. కొన్ని ప్రాంతాల్లో రోడ్లను అసలు మెరక చేయని పరిస్థితి కనిపిస్తోంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా కూడా రోడ్లు ఇంకా అధ్వానంగానే ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కనీసం రోడ్లైన సరిగా వేస్తే లబ్ధిదారులకు కొంత వెసులుబాటుగా ఉంటుందని లబ్ధిదారులు అంటున్నారు.



నాగన్నగూడెం వద్ద జగనన్న కాలనీ లేఅవుట్‌లో చెరువులా కనపడుతున్న అంతర్గత రహదారులు

ఇదీ నిర్మాణ స్థితి

మొత్తం లబ్ధిదారులకు ఇచ్చిన ప్లాట్లు	2004
పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు	189
బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నాయి	273
లెంటల్ లెవెల్‌లో	116
రూఫ్ లెవెల్‌లో	36
రూఫ్ కాస్ట్‌లో	9

రోడ్లు మెరక చేస్తాం

నాగన్నగూడెం లేఔట్‌లో మెరక పనులు చేస్తాం. ప్రస్తుతం కొంత రబ్బీష్ నిల్వ ఉంది. దాన్ని త్వరలో ఆయా అంతర్గత రహదారులు, ప్రధాన రహదారులకు తరలించి మెరక చేయిస్తాం. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. **- పి.వెంకటేశ్వరరావు, కమిషనర్ నగర పంచాయతీ**

కొనకళ్లకు అభినందన

కంకిపాడు గ్రామీణం, పెనమలూరు, రామవరప్పాడు, న్యూస్‌టుడే: కష్టపడి చేసే నాయకులను కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రాధాన్యం ఇస్తుందని చెప్పడానికి మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ ఉదాహరణగా జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో కొనకళ్ల నారాయణకు ఆర్టీసీ ఛైర్మన్ ఇవ్వడంపై హర్షం ప్రకటించి మచిలీపట్నంలోని నారాయణ ఇంటికివెళ్లి అభినందించారు. జనసేన నాయకులు బోయిన నాగరాజు, సుంకర శివ, వాడమల్లి బాబు, పచ్చిపాల శేఖర్, వాకా ఓంకార్ తదితరులున్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, తెదేపా నాయకులు కొనకళ్లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. తెదేపా నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్, సుదిమళ్ల రవీంద్ర, మల్లంపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విజయవాడ రూరల్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొడ్డళ్ల చిన్న రామారావు, వేములకొండ నాగరాజు, మైలవరం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు కలిసి అభినందనలు తెలిపారు.



నారాయణరావు, బుల్లయ్యలను సన్మానిస్తున్న చిన్న రామారావు, నాగరాజు, వెంకట నరసింహారావు

వరద బాధితులకు చేయూత



విజయవాడ పరిసరాల్లోని వరద బాధితులకు గన్నవరం మండలం దావాజీగూడెం సీతారామాంజనేయ స్వామి ఆలయ శ్రీవైఖానస యూత్ ఫోరం అధ్యక్షులు ఎన్.రామాచార్యుల బృందం శుక్రవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. సుమారు 120 బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసర సామగ్రి, వంట పాత్రలను అందించినట్లు తెలిపారు. ఆర్.వెంకటాచార్యులు, ఎమ్.మారుతీ, ఎమ్.రామకృష్ణ, కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం**

సీఎం సహాయ నిధికి విరాళం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: వరద బాధితుల ఉయ్యూరులోని శ్రీ ఎం.కె.బాబు విద్యాసంస్థ అండగా నిలిచింది. పాఠశాల తరఫున రూ. లక్ష విలువైన చెక్కును శుక్రవారం సంస్థ అధినేత ఎం.కె.బాబు, విద్యార్థులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఉండవల్లిలో అందించారు. యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఒక రోజు వేతనం కలిపి అందజేశారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రాజులపాటి ఫణికుమార్ కూడా పాల్గొన్నారు.

గోసాల(పెనమలూరు), న్యూస్‌టుడే : గోసాల కోనేరు ఛారిటబుల్ ట్రస్టు, వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.91 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు అందజేసి ముఖ్యమంత్రి సహాయనిధికి జమ చేయాలని కోరారు.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న ఎం.కె.బాబు, విద్యార్థులు



ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న వృద్ధులు, ట్రస్ట్ ప్రతినిధులు

వైభవంగా హోమం, కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వీరవల్లి జాతీయ రహదారి పక్కనే ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం శాంతి హోమం, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కోడూరుపాడుకు చెందిన చందు శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు అమ్మవారి పంచలోహ విగ్రహం తయారు చేయించి, శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని సుందరంగా అలంకరించి గుడిలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

నాణ్యత డొల్ల.. నిధులు గుల్ల

పెనమలూరు, న్యూస్‌టుడే

సూరప్ప చెరువు కట్ట కూలిపోతోంది. అండలు అండలుగా విరిగి చెరువులోకి పడిపోతోంది. నాణ్యత, సాంకేతిక లోపాలతో ఈ చెరువుకు ఉత్తరం వైపు కట్ట నెమ్మదిగా కనుమరుగవ్వడంతో పాటు ప్రాణాంతకంగా తయారైంది. వైకాపా పాలనలో పెనమలూరు, తాడిగడప, పెదపులిపాకల పరిధిలో ఏర్పాటు చేసిన అక్రమ లేఔట్లకు వెళ్లేందుకు ఈ రహదారిని ప్రభుత్వ నిధులతో నిర్మించారనే ఆరోపణలున్నాయి. ముందూ వెనుకా చూడకుండా ఈ రహదారిని తారు రోడ్డుగా ఏర్పాటు చేయడంతో మూడేళ్లగా ఈ కట్ట రహదారి ప్రమాదకరంగా మారింది.

ప్రభుత్వ నిధులు చెరువుపాలు

సూరప్ప చెరువు పెదపులిపాక పరిధిలోకి వస్తుంది. ఇది పెనమలూరు, తాడిగడప, పెదపులిపాక నడుమ ఉంటుంది. ఈ చెరువుకు ఉత్తరం వైపున్న కట్ట గతంలో డొంకరోడ్డుగా ఉండేది. వైకాపా పాలనలో ఈ చెరువుకు తూర్పు వైపున అనేక అక్రమ లేఔట్లు పుట్టుకొచ్చాయి. వాటిని అమ్మేందుకు వ్యాపారాలకు అనుకూలంగా ఈ రహదారిని తారురోడ్డుగా అభివృద్ధి చేశారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఈ రహదారిని అభివృద్ధి చేసిన ఏడాది కే రహదారి విరిగిచెరువులోకి పడిపోవడం ప్రారంభమయింది. దీంతో ప్రమాదకరంగా మారింది. భారీవర్షాలకు చెరువు పొంగి చెరువు కట్టకు సమాంతరంగా నీరు నిండిపోతుండటంతో రాకపోకలు సాగించే రైతులు, అక్రమ లేఔట్లలో నివాసాలు ఏర్పాటు చేసుకొన్న నివాసితులకు ప్రాణాంతకంగా తయారయింది. రహదారి నిర్మాణానికి దాదాపు రూ. 20 లక్షల వరకూ ప్రభుత్వ నిధులు వెచ్చించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది కురిసిన భారీవర్షాలకు చెరువు కట్ట మరింత ప్రమాదకరంగా మారింది.



పెనమలూరు వైపు చెరువులోకి విరిగిపడుతున్న కట్ట

చీకట్లో అదుపు తప్పితే అంతే..

సూరప్పచెరువు లోతు దాదాపు 30 అడుగుల వరకూ ఉంటుంది. ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ చెరువు ఉత్తరం కట్టపై ప్రయాణం మరింత దారుణంగా ఉంది. కార్లు, ద్విచక్రవాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే పెద్ద సాహసమే. దీనికి తోడు అక్రమ లేఔట్లలో నిర్మిస్తున్న నివాసాలకు కంకర, ఇసుక లారీలు ఇటుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరగడంతో పాటు చెరువుకట్ట ముక్కలుగా విరిగి చెరువులోకి పడుతోంది. కొంత కాలం కిందట టిప్పరు నేరుగా చెరువులోకి పల్టీ కొట్టింది. రహదారికి రక్షణ ఏర్పాట్లు చేయాలని మూడు గ్రామాల రైతులు కోరుతున్నారు.

'గ్రంధి రాము'కు నివాళి

కంకిపాడు, న్యూస్‌టుడే : కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘం వేదిక రాష్ట్ర మాజీ ప్రతినిధి గ్రంధి రామకృష్ణ (రాము) సంస్మరణ సభను స్థానిక కన్యకా పరమేశ్వరి మందిరంలో శుక్రవారం నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లిపర సీతారాంబాబు, కార్యదర్శి చవట నరసింహారావు, కేడీసీసీ విశ్రాంత జీఎం కంకిపాటి నాగమల్లేశ్వరరావు, ఆంధ్రాబ్యాంకు విశ్రాంత మేనేజర్ కానూరు భాస్కరరావు, వివిధ సంఘాల ప్రతినిధులు మద్దుల ప్రకాష్, గోళ్ల శ్రీనివాసరావు, మారం రామారావు, గ్రంధి సుబ్రహ్మణ్యం, యండూరి వాసు, గ్రంధి లావణ్యకుమార్, వంకదారు హరిబాబు, కంకిపాటి చిట్టియ్య తదితరులు పాల్గొని రాము చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సంతాప సూచికంగా కిరాణా దుకాణాలను మూసివేశారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

భోజన కంచాలు, గ్లాసుల పంపిణీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వేలేరులోని పట్టణ అణగారిన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మేడికొండ బుచ్చిబాపయ్య, కళ్లేపల్లి నారాయణరావు రూ.13 వేల విలువైన వస్తువులు పంపిణీ చేశారు. వ్యాయామోపాధ్యాయులు బొల్లెద్దు భాగ్యరాజు సహకారంతో వీటిని సమకూర్చినట్లు నారాయణరావు తెలిపారు. లయన్స్ సభ్యులు నండూరి శర్మ, అక్కినేని రాఘవేంద్రరావు, ప్రిన్సిపల్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో మహిళకు గాయాలు

గోసాల(పెనమలూరు), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో మహిళకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జగ్గారపు నాగవిజయగౌరి కంకిపాడు నివాసి. ఆమె ఈ నెల 26వ తేదీన ఉదయం నడక కోసం గోసాల ప్రాంతానికి వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు బందరు రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పెనమలూరు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దాడి చేసిన సోదరులపై కేసు

పెనమలూరు, న్యూస్‌టుడే : రోడ్డుపై అడ్డుగా పెట్టిన ద్విచక్ర వాహనాన్ని పక్కకు జరపాలని కోరిన ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా కొట్టిన అన్నదమ్ములపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. మారం భరద్వాజ్ యనమలకుదురు ఇందిరానగర్ నివాసి. ఈ నెల 15వ తేదీన జన్మభూమి వంతెన వద్ద జరుగుతున్న వినాయకుడి విగ్రహ ఊరేగింపులో డొక్కు సురేంద్ర అనే యువకుడు తన ద్విచక్ర వాహనాన్ని అడ్డుగా పెట్టడంతో తొలగించాలని భరద్వాజ్, అతని స్నేహితుడు కోన కల్యాణ్‌చక్రవర్తి కోరారు. ఆగ్రహం చెందిన సురేంద్ర, సోదరుడు శివలు వారిపై దాడి చేసి చితకబాదారు. గాయాలపాలైన వారు చికిత్స పొందుతూ పెనమలూరు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా సురేంద్ర, శివలపై కేసు నమోదు చేశారు.

వీఆర్వోల బదిలీలు

కంకిపాడు, న్యూస్‌టుడే : కంకిపాడు మండలంలో పనిచేస్తున్న పలువురు బదిలీ అయ్యారు. ఎన్.మాధురీదేవి కానూరు-1, మొరకపల్లి సుబ్బారావు- కంకిపాడు-2, ఎన్.నరసింహారావు- కాటూరు, చిన్నం నాగేశ్వరరావు- కంకిపాడు-3, ఏడుకొండలు పోరంకి-3, అర్జునరావు ఉప్పలూరు, ఎస్.శివనాగమణి- సావారిగూడెం, నాగకొండబాబు- దావులూరు, బి.నాగిరెడ్డి- పునాదిపాడు-2, కె.వరప్రసాద్ వణుకూరు-2, కె.సృజన్- మద్దూరు, ఎం.రఘురాంప్రసాద్- నెప్పల్లి, పి.సురేష్‌బాబు- కుందేరు, కె.ప్రవీణ్- తెన్నేరు, పి.సూర్యప్రనరసింహారావు- గొడవర్రు, ఆర్.సుబ్రహ్మణ్యం- వేల్పూరు, డేవిడ్‌రాజు- మంతెన, కె.సందీప్- ప్రొద్దుటూరు, పి.విజయకుమార్- పునాదిపాడు-1కి, ఆర్.ఎస్.కె.మల్లికార్జునరావును కోలవెన్నుకు బదిలీ చేసినట్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి.

భవిత కేంద్రాల్లో ట్యాబ్, యాప్‌ల ద్వారా బోధన

ఉయ్యూరు, న్యూస్‌టుడే : భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ట్యాబ్, ఆప్‌ల ద్వారా విద్యాబోధన వారిలో మానసిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్యా కోఆర్డినేటర్ అన్నపూర్ణ అన్నారు. ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భవిత కేంద్రాల్లో బోధించే సహిత విద్య ఉపాధ్యాయులకు ట్యాబ్, ఆప్‌లపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ కె.శ్రీరాములు నాయక్, రాష్ట్ర సహాయ ఐఈడీ కోఆర్డినేటర్ రాంబాబు, ఎంఈవో సుధారాణి, పర్యవేక్షకుడు నరసింహ, రిసోర్స్ పర్సన్‌లు సునీల్ మహాలక్ష్మినాయుడు, వీరయ్య నాయక్‌లు పాల్గొన్నారు.

గన్నవరం సబ్‌రిజిస్ట్రార్‌గా ప్రసాద్

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం నూతన సబ్‌రిజిస్ట్రార్‌గా ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానికంగా పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు విజయవాడ గాంధీనగర్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ప్రసాద్ నియమితులయ్యారు. సిబ్బంది, పలువురు డాక్యుమెంట్ రైటర్లు స్వాగతం పలికారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఏపీసీపీడీసీఎల్ హనుమాన్‌జంక్షన్ ఏడీఈ బి.శ్రీనివాసరావు తెలిపారు. హనుమాన్‌జంక్షన్ ఏఈగా జీడీవీ ప్రసాద్, వీరవల్లి ఏఈగా మురళీకృష్ణ, తేలప్రోలు ఏఈగా జె.దుర్గారావు, ఉంగుటూరు ఏఈగా ఎ.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరంతా ఏడీని మర్యాదపూర్వకంగా కలిశారు.

కోతుల బెడద తొలగించాలంటూ ధర్నా

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కోతుల బెడద విపరీతంగా ఉందని, తక్షణమే వీటి నివారణకు చర్యలు చేపట్టాలంటూ పెరికీడు గ్రామస్థులు శుక్రవారం రాత్రి పెదన-విస్సన్నపేట జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. గత కొన్ని రోజుల నుంచి వానరాల చేష్టలు తట్టుకోలేకపోతున్నామని, చిన్నా, పెద్ద అందరి మీద పడి గాయపర్చడం, ఇళ్లల్లో వస్తువులు పాడు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై జనార్దన్ ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.


ఉత్తమ అవుట్ గోయింగ్ విద్యార్థినిగా అన్విత

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాల ఉత్తమ అవుట్ గోయింగ్ విద్యార్థినిగా హనుమాన్ జంక్షన్‌కు చెందిన అన్విత పుట్టగుంట పురస్కారం అందుకున్నారు. 2019-24 విద్యా సంవత్సరానికి గాను అకడమిక్ విభాగంలో అన్విత ఉత్తమ విద్యార్థిగా నిలిచారు. శుక్రవారం రాత్రి కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మెమెంటో, ప్రశంసా పత్రంతో ఆమెను అభినందించారు. ఎంబీబీఎస్ చదివిన నాలుగేళ్లు వరసగా కళాశాల అగ్రగామిగా అన్విత నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఆమె పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ పుట్టగుంట సతీష్‌కుమార్ కుమార్తె.



పురస్కారం అందుకుంటున్న అన్విత పుట్టగుంట

క్రీడాకారులకు అభినందన



విజేతలుగా నిలిచిన బాపులపాడు క్రీడాకారులతో ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 26న బాపులపాడులో నిర్వహించిన మండలస్థాయి క్రీడా పోటీల్లో బాపులపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రమ్యశ్రీ, ఎస్.ఎఫ్.అస్మ, అనుష్క, సాయిలత, షాలిని, కావ్య, అంజలి, జ్యోతిక, సుకన్య, సాక్షికుమారి, వీరవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన చంద్రిక, ధరణిలక్ష్మి, నాగప్రణతి, హేమలత, రూపిత, కావ్య, రంగమ్మ, శాలిని, హారిక, యామిని వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, షటిల్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీవీ నాగేశ్వరరావు, పి.నిర్మల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం వీరిని, పీఈటీలు పామర్తి వెంకటేశ్వరరావు, లక్ష్మణరావులను అభినందించింది.

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి వితరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడులో ఉన్న అయిదు అంగన్‌వాడీ కేంద్రాలకు స్రవంతి ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో సామగ్రి పంపిణీ చేశారు. మంచి నీటి సీసాలు, బిందెలు, బ్లాక్‌బోర్డులు, రాత పుస్తకాలు, భోజన ప్లేట్లు, గ్లాసులు, ఇతరత్రా వస్తువులను ఆయా కేంద్రాల అవసరాలకు అనుగుణంగా సమకూర్చారు. శుక్రవారం ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ డీవీ రమణ, వార్డు సభ్యులు తాడిశెట్టి శ్రీను, నాయకులు దాసరి బెనర్జీ, యార్లగడ్డ సత్యనారాయణ, వడ్లమూడి ఆంజనేయులు, ముత్యాల సువర్ణరాజు పాల్గొన్నారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679



? కోటిరెడ్డిపేటలో ప్రకాశ్‌రావు మాస్టారు ఇంటి ముందు రహదారి గోతులు పడి పూర్తిగా పాడైంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. **- వి.అప్పారావు, పామర్రు**

✔ పంచాయతీలో నిధుల లభ్యతను బట్టి రహదారి నిర్మిస్తాం. **- సలీమ్, కార్యదర్శి**

? ధనియాలపేటలోని పాత కాలనీలో కడి వైపున గల 3వ సిమెంట్ రోడ్‌లో ఒక పక్క టిఫిన్ సెంటర్, మరోపక్క ఇసుక, తదితర సామాగ్రి వేసి రోడ్డును మూసేశారు. విద్యార్థులను తీసుకెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. **- వెంకటేశ్వరరావు, ధనియాలపేట పాత కాలనీ**

✔ పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరిసాం **- బి.యేసుబాబు, టీపీవో, పురపాలక సంఘం, గుడివాడ**

- న్యూస్‌టుడే పామర్రు, గుడివాడ పట్టణం

విద్యార్థులకు కంటి పరీక్షలు

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: కృష్ణా జిల్లాలో అంధత్వ గల పిల్లలందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొవ్వ మండల కనకయ్య జడ్పీపాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. మొవ్వ, పమిడిముక్కల మండలాలకు చెందిన 26మంది విద్యార్థులకు సమగ్ర శిక్షా, ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల, జిల్లా బ్లైండ్‌నెస్ సొసైటీ వారి సంయుక్తాధ్వర్యంలో ఈ పరీక్షలు చేశారు. ఎంఈవోలు శివశంకర్, శ్రీలక్ష్మి, సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ అధికారి కళ్లేపల్లి ఏడుకొండలు, మొవ్వ ఎంపీపీ కొండేటి ఇందిర, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

గుడివాడ గ్రామీణం: విద్యుత్తు ఉప కేంద్రాల్లో మరమ్మతుల దృష్ట్యా గుడివాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం సరఫరా నిలిపి వేస్తున్నామని గుడివాడ విద్యుత్తు శాఖ డీఈ టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. పెద ఎరుకపాడు, బేతవోలు, కార్మికనగర్, నిమ్మతోట, ఇందిరానగర్ కాలనీ, వాంబేకాలనీలో ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

☛ గుడివాడ మండలం మోటూరు గ్రామంలోని ఉప కేంద్రం మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలుపి వేస్తున్నట్లు గ్రామీణ ఏఈ ఎ.ఎస్.ప్రకాష్ శుక్రవారం తెలిపారు. మోటూరు, సైదేపూడి, శేరీ గోల్వేపల్లి తదితర గ్రామాల పరిధిలో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఖాతాల్లో పరిహారం రైతు మోములో ఆనందం

పామర్రు నియోజకవర్గంలో రూ.10.25 కోట్లు జమ

న్యూస్‌టుడే, పామర్రు గ్రామీణం, అవనిగడ్డ, గుడివాడ గ్రామీణం



జమీగొల్వేపల్లిలో ముంపు బారిన పడి కుళ్లిన వరి పైరు

భారీ వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు కూటమి సర్కారు ఆపన్నహస్తం అందించింది. మును పెన్నడూ లేని విధంగా అతి తక్కువ సమయంలోనే నష్టపోయిన ప్రతి రైతునీ గుర్తించి వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా పరిహారం జమ చేసి బాధితులకు భరోసా ఇచ్చింది. దీంతో యావత్తు కర్షక వర్గం హర్షం వ్యక్తం చేస్తోంది. సకాలంలో పరిహారం అందించడంతో మళ్లీ సాగుకు ఉపక్రమించడానికి అవకాశం కలిగిందని రైతులు చెబుతున్నారు. పామర్రు నియోజకవర్గంలో 7,501 మంది రైతులకు చెందిన 4,087.11 హెక్టార్లలో వరి సాగు ముంపు బారిన పడి పాడవ్వగా ప్రభుత్వం నష్టపరిహారంగా రూ. 10,25,64,647.5 బాధిత రైతుల ఖాతాల్లో జమచేసింది. రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

పామర్రు నియోజకవర్గంలో ఇలా..

మండలం	రైతులు	నష్టం విస్తీర్ణం (హెక్టార్లు)	పరిహారం సొమ్ము (రూ.ల్లో..)
పమిడిముక్కల	753	400.38	1,14,03,480
పెదపారుపూడి	2,220	1,303.6	3,19,32,117.5
మొవ్వ	2,352	1,212	3,03,06,000
తోట్లవల్లూరు	764	282.76	67,13,800
పామర్రు	1,412	888.37	2,22,09,250

☛ అవనిగడ్డ నియోజకవర్గంలో 6,517 మంది రైతులు 5,108 హెక్టార్లలో పంట నష్టపోయారని అధికారులు గుర్తించారు. ప్రభుత్వం వరి పంటకు పరిహారంగా హెక్టారుకు రూ. 25,000 చొప్పున అందించింది. నష్టపోయిన రైతుల ఖాతాలకు రూ. 7,62,00,000 జమ చేసింది.

☛ గుడివాడ మండలంలో మొత్తం 22 గ్రామాల్లోని 1852 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. మొత్తం 1336 మంది రైతులకు ప్రభుత్వం రూ. 1.86 కోట్లను వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. రామనపూడి, తటివర్రు, దొండపాడు, శీపూడి, శేరీ వేల్పూరు తదితర గ్రామాల్లో అధికంగా పంటలకు నష్టం వాటిల్లింది.

కూటమి ప్రభుత్వం ఊతమిచ్చింది



ప్రకృతి కన్నెర్ర చేయడంతో రూ.వేలల్లో ఖర్చు పెట్టి వేసిన వరి పూర్తిగా పాడైంది. కూటమి సర్కారు పరిహారం అందించి బాధిత రైతులకు ఊతమిచ్చింది. ఇంత త్వరగా పరిహారం అందించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. **- మట్టా వెంకటేశ్వరరావు, రైతు, ఉండ్రపూడి**

ఇంత త్వరగా ఇవ్వడం ఇదే ప్రథమం



పంటలకు నష్టం వాటిల్లితే గత ప్రభుత్వాలు చాలా కాలం తర్వాత పరిహారాలు అందించాయి. ప్రస్తుత కూటమి సర్కారు అతి తక్కువ కాలంలోనే నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం జమచేయడం ఆనందంగా ఉంది. ఇలా చేయడం నాకు తెలిసి ఇదే ప్రథమం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 8.60 ఎకరాల్లో పంట పూర్తిగా పాడవ్వగా ప్రభుత్వం పరిహారం సొమ్ము జమ చేసింది. **- వల్లభనేని రామకృష్ణ, కౌలు రైతు, జమీగొల్వేపల్లి**

మళ్లీ సాగుకు సహాయం



రెండు ఎకరాల విస్తీర్ణంలో వరి పంట నీట మునిగి కుళ్లిపోయింది. ప్రభుత్వం వెంటనే రూ. 20,000 పరిహారంగా నా బ్యాంకు ఖాతాలో జమ చేసింది. దీంతో మళ్లీ సాగు చేసుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం సహాయం అందించడం విశేషం. **- బడే సాయిబాబు, కోడూరు**

రూ.20 వేలు జమ అయ్యింది



ఎకరం విస్తీర్ణంలో పసుపు సాగు చేయగా రూ. 80 వేలు ఖర్చయ్యింది. వరదలకు పంటంతా నీట మునిగి పైరు కుళ్లిపోయింది. ప్రభుత్వం రూ. 20,000 సహాయం అందించి ఆదుకుంది. వెంటనే మరో పంట సాగు చేసుకునే అవకాశం కలిగింది. **- సింహాద్రి రవికిరణ్, బందలాయిచెరువు**

సకాలంలో చేయూత



ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు నెలలోపు ప్రభుత్వం పరిహారం అందించడం విశేషం. సకాలంలో రైతులకు చేయూత అందించి ఆదుకున్నారు. నాకు 86 సెంట్ల విస్తీర్ణానికి రూ. 6,800 పరిహారంగా నా ఖాతాలో జమ చేశారు. **- అన్నపరెడ్డి కృష్ణ, అవనిగడ్డ**

చరిత్రలో ఎన్నడూ ఇలా జరగలేదు



పంట ముంపు బారిన పడిన రోజుల వ్యవధిలోనే నష్టం అంచనా వేసి రైతులకు పరిహారం అందించడం చరిత్రలో ఎన్నడూ జరగలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల కష్టం తెలుసుకొని ఇచ్చిన మాట ప్రకారం పరిహారం అందించారు. ఏ రైతూ ఇబ్బంది పడకుండా వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. రైతులు ఆయనకు రుణపడి ఉంటారు. **- అట్లూరి నాగేంద్ర ప్రసాద్, మల్లాయపాలెం**

అభివృద్ధి, ఉపాధి లక్ష్యంగా పని చేస్తా : రాము



భూమిపూజలో ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి తదితరులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గం అభివృద్ధి, యువతకు ఉపాధి లక్ష్యంగా పని చేస్తున్నానని. . ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. లింగవరంలో రూ. 51.2 లక్షలతో 10 సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ లింగవరంలో భూములపై కన్నేసిన కొడాలి నాని ప్రజలకు తెలియకుండా వారి ఆస్తులు దోచుకున్నారన్నారు. మండలంలో రోడ్ల అభివృద్ధికి రూ. 17.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. లింగవరంలో రూ. 35.6 లక్షల ఉపాధి నిధులతో 8 సీసీ రహదారులు, డీఎంఎఫ్ నిధులు రూ. 10 లక్షలతో, ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు రూ. 5.6 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మెరకగూడెం గ్రామస్థుల పొలం 22ఏలో చేర్చి వారికి అన్యాయం చేశారన్నారు. జనసేన నియోజకవర్గ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, భాజపా కన్వీనర్ దావులూరి సురేంద్ర బాబు, వాసే మురళి, తాహసిల్దారు రామకోటేశ్వరరావు, ఎంపీడీవో ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు లంక రైతుల సన్మానం

చల్లపల్లి, న్యూస్‌టుడే: పంటలకు ఈ క్రాప్ చేయించి వరద నష్టపరిహారం వచ్చేలా కృషిచేసిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు చల్లపల్లి మండలం వెలివోలు లంకల రైతులు శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 136మంది రైతులకు సంబంధించిన మల్బరీ, కంద, పసుపు, అరటి పంటలు వరదల వల్ల నష్టపోయామని చెప్పారు. పరిహారానికి కృషి చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తోపాటు వెంకట్రామ్(రాజా)కు వెలివోలు లంకల రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అక్టోబరు ఒకటి నుంచి గ్రామ సభలు

పమిడిముక్కల, న్యూస్‌టుడే: అక్టోబరు 1 నుంచి ఉపాధిహామీ పథకంలో పనులు గుర్తింపునకు గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీవో విఠల్‌పాల్ అన్నారు. మండలపరిషత్తు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమంతపురం కాలువలో పూడిక తీయకపోవడంతో గుర్రపుడెక్క, తూటుకాడ పెరిగి సాగునీరందక 30 ఎకరాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ అధికారులకు తెలిపినా చర్యలు తీసుకోలేదని ఆ గ్రామ సర్పంచి కలపాల రాంబాబు తెలపగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. తహసీల్దారు నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ ఏఈ మండల పరిధిలోని పలు రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనట్టు పేర్కొన్నారు. ఎంపీపీ వేదసుప్రజ, జడ్పీటీసీ సభ్యురాలు వైవీ.రమణకుమారి, వైస్ ఎంపీపీలు మహేష్, సీతారామయ్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



సహాయం అందుకున్న వారితో ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం వివిధ అనారోగ్యాలకు చికిత్స చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను అందించే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్‌తో కలిసి 14 మందికి రూ. 11,56,946 ఆర్థికసాయాన్ని అందించారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: తోట్లవల్లూరులో పలువురు రెవెన్యూశాఖ అధికారులు బదిలీ అయ్యారని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి శుక్రవారం తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన ధనలక్ష్మీ బదిలీపై పెదపారుపూడి వెళ్లగా ఆమె స్థానంలో తోట్లవల్లూరులో రిసర్వేయర్ డీటీగా పనిచేస్తున్న బి.సత్యనారాయణను నియమించారు. సీనియర్ అసిస్టెంట్ ఎల్.రామ్మోహన్‌రావు బదిలీ అవ్వగా ఆయన స్థానం మోపిదేవిలో ఆర్‌ఐగా పనిచేస్తున్న సునీల్ తోట్లవల్లూరు వచ్చారు. రిసర్వేయర్ డీటీగా వెంకటేశ్వరరావు తోట్లవల్లూరు వచ్చారు. వీరితో పాటు పలువురు వీఆర్‌వోలు బదిలీ అయ్యారు.

పట్టుపరిశ్రమ వరదార్పణం

ఆదుకోవాలని వేడుకుంటున్న రైతులు



వరదకు పాడైపోయిన పట్టుపురుగుల గూళ్లు వేరుచేసుకుంటున్న రైతులు



షెడ్డులో దెబ్బతిన్న ర్యాక్‌లు, కుళ్లిపోయిన పట్టుపురుగుల గూళ్లు

న్యూస్‌టుడే, చల్లపల్లి, ఘంటసాల

పట్టుపురుగుల పెంపకం.. చల్లపల్లి మండలం వెలివోలు చీడేపూడిలంకలో సన్న, చిన్నకారు రైతులకు ఇదే జీవనాధారం. సుదీర్ఘ కాలం నుంచి 90 ఎకరాల్లో మల్బరీ తోటలు సాగు చేస్తూ 45కుపైగా షెడ్లలో పట్టుపురుగులు పెంచుతున్నారు. కృష్ణా నదికి ఇటీవలి వచ్చిన వరదలకు ఎప్పుడూ లేని విధంగా రైతులు దారుణంగా నష్టపోయారు. పూర్తిస్థాయిలో ఆదుకోవాలని పట్టుపురుగుల సాగు రైతులు కోరుతున్నారు.

శిథిలమైన షెడ్లు, మునిగిన మోటార్లు

ఉవ్వెత్తున వచ్చిన వరద ధాటికి పట్టుపురుగుల పెంపకానికి కీలకమైన షెడ్లు బీటలు వారాయి. సిమెంటు రేకులు పగుళ్లిచ్చాయి. ఒక్కో షెడ్డు నిర్మించాలంటే రూ. 4 లక్షల నుంచి రూ. 5లక్షల వరకు ఖర్చవుతోంది. దీనికితోడు విద్యుత్తు మోటార్లు మునగడంతో రైతుల నెత్తిన తీవ్రభారం పడింది. షెడ్లలో ర్యాక్‌లు, ట్రేలు, చంద్రికలు, మల్బరీతోటలు మొత్తం కొట్టుకుపోయాయి.

మూడు నెలలు పంట విరామం

వరద ఉధృతికి షెడ్లు, లోపల ర్యాక్‌లు పాడైపోవడంతోపాటు వరద మల్బరీ తోటలను ముంచెత్తింది. పట్టుపురుగుల పెంపకం చేపట్టాలంటే మల్బరీ ఆకులు శుభ్రంగా ఉండాలి. వారం రోజులపాటు వరదనీటిలో ఉన్న బురద మల్బరీ ఆకులపై పేరుకుపోవడంతో తోటలు పూర్తిగా కుళ్లిపోయి పనికిరాకుండా పోయాయి. పట్టుపురుగులకు మళ్లీ మల్బరీ ఆకులు అందించేందుకు మూడు నెలల సమయం పడుతుంది. అప్పటివరకు పంట విరామం తప్పదని రైతులు పేర్కొంటున్నారు. షెడ్లలో బురద పేరుకుపోవడంతో తొలగించే పనుల్లో రైతులున్నారు. ఈ పంట విరామం సమయంలో ఒక్కో రైతుకు రూ. 60 వేలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

తీవ్ర నష్టం మిగిల్చింది



వెలివోలు పట్టుపురుగుల పెంపకం రైతులు

పట్టుపురుగుల పెంపకానికి షెడ్ల నిర్మాణం కోసం పట్టు పరిశ్రమ శాఖ రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు మంజూరు చేస్తోంది. ప్రస్తుతం వరదలకు తీవ్రంగా నష్టపోయి అప్పులపాలైన రైతులకు కొత్తగా షెడ్లు నిర్మించి, విద్యుత్తు మోటార్లు, చంద్రికలు, ట్రేలు, ర్యాక్‌లు అందించి ఆదుకోవాలి. వరద వచ్చే సమయానికి పట్టుపురుగుల గూళ్లు మీద ఉన్నాయని.. వారం రోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న పంట వరదపాలై తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

దివిసీమ గాంధీకి నివాళి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



నాగాయలంక : వెంకటకృష్ణారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కూటమి శ్రేణులు, అభిమానులు

దివిసీమ గాంధీ దివంగత మండలి వెంకటకృష్ణారావు వర్ధంతిని అవనిగడ్డ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన, తెదేపా కార్యాలయాలతోపాటు వివిధ ప్రాంతాల్లోని ఆయన విగ్రహాలకు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చిత్రపటాలకు అతిథులు, పలువురు ప్రజాప్రతిధులు, మాజీలు, ఇతర ప్రముఖులు పూల దండలు వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు, దివిసీమ గ్రామీణ యువజన వికాస సమితి సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 350 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. తొలుత మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రెడ్‌క్రాస్ మోపిదేవి యూనిట్ ఆధ్వర్యంలో మోపిదేవిలో కూడా వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కోడూరు ప్రభుత్వ పశువైద్యశాలలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. **– న్యూస్‌టుడే బృందం**

శ్రీకాకుళం విద్యార్థులకు ప్రథమస్థానం



విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న ఎంఈవో-2 మోమిన్, ప్రధానోపాధ్యాయిని శ్రీరంగవల్లి

ఘంటసాల, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మండలస్థాయిలో ఘంటసాల జడ్పీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. శ్రీకాకుళం జడ్పీ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు ఆత్మూరి జ్యోతి వ్యాసరచన పోటీలో, హంసికా ఫణిదేవి వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించినట్లు ఎంఈవో-2 మహ్మద్ మోమిన్ తెలిపారు. గోగినేనిపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.వల్లీకుమారి వ్యాసరచనలో ద్వితీయస్థానం, వక్తృత్వ పోటీల్లో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విద్యార్థులను ఎంఈవోతో పాటు ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీరంగవల్లి, ఎ.ఎ.భువనేశ్వరి, టి.వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాగాయలంక, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో ఖోఖో పోటీల ఎంపిక శుక్రవారం కోడూరు మండలం లింగారెడ్డిపాలెం జడ్పీ పాఠశాల క్రీడమైదానంలో నిర్వహించారు. ఇందులో నాగాయలంక జడ్పీ పాఠశాల విద్యార్థినులు నాయుడు జ్యోతి, నాయుడు దివ్య, తమ్ము భావన, బొడ్డు శ్రావణి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు.

అధికారులు, ఉద్యోగులకు సన్మానం



డీటీ కనకదుర్గ, బేగంలను సన్మానిస్తున్న వీఆర్‌వోలు, వీఆర్‌ఏ, కార్యాలయ సిబ్బంది

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న డి.సత్యవతి బదిలీ అయిన సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ అందించిన సేవలను కొనియాడారు. సంఘ కార్యదర్శి ఉదయ్‌కుమారి, కోశాధికారి నందిపాటి వెంకటరామకృష్ణారెడ్డి, రాష్ట్రనాయకుడు గోగినేని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: దశాబ్దానికిపైగా ఉప తహసీల్దార్‌గా, ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా గుడ్లవల్లేరు మండల అభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన డీటీ కనకదుర్గ సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. డీటీ కనకదుర్గ బదిలీపై ఘంటసాల వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఆమెను మండల వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అలాగే బదిలీపై వెళ్తున్న ఆర్ఐ బేగంను కూడా సత్కరించారు.

పమిడిముక్కల, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల పైగా మండలంలో మండల సర్వేయరుగా పని చేసి బదిలీపై గుడివాడ వెళ్తున్న బేతపూడి శామ్‌ప్రకాశ్ మణికుమార్‌ను శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. తహసీల్దారు నవీన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు ఏసుపాదం, గ్రామ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది మణికుమార్‌ను సత్కరించారు.

ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్లకు సత్కారం



నారాయణరావును సన్మానిస్తున్న ఘంటసాల, చల్లపల్లి మండలాల తెదేపా నాయకులు

ఘంటసాల,న్యూస్‌టుడే: మాజీ ఎంపీ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును ఘంటసాల, చల్లపల్లి మండల తెదేపా నాయకులు మచిలీపట్నంలో మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. నారాయణరావుతోపాటు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావును వారు సత్కరించారు. తెదేపా నాయకులు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భానుప్రకాష్, యార్లగడ్డ వీర భద్రరావు, పరిశే చలపతిరావు, మోర్ల రాంబాబు, శివ, తదితరులు పాల్గొన్నారు.

కాజ(కూచిపూడి), న్యూస్‌టుడే: మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించడంతో మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన పలువురు తెదేపా నాయకులు ఆయన నివాస గృహంలో శుక్రవారం పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ వై.శ్రీనివాసరావు, నాయకులు జె.శ్యామ్, కాగిత నాంచారయ్య, పేకేటి నవీన్‌రెడ్డి, కృష్ణాజిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు ఎన్.వీరేంద్ర తదితరులు కొనకళ్లకు అభినందనలు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ



ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా కుంచే ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా గుణదల జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన ప్రసాద్ బదిలీల్లో భాగంగా చల్లపల్లికి వచ్చారు. చల్లపల్లి రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా తాడేపల్లి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్‌లుగా అనూష, పూర్ణచంద్రరావులు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌ను పూలదండలు, శాలువాలతో సత్కరించారు.



సత్యనారాయణ

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ సబ్ రిజిస్ట్రార్‌గా అంబటి సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడలోని స్టాంప్స్ అండ రిజిస్ట్రేషన్ శాఖలో ఆడిట్ విభాగంలో విధులు నిర్వహించి మొవ్వ సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎల్ వెంకటేశ్వర్లు పెడన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సిబ్బంది బాధ్యతలు చేపట్టిన ఆయనను అభినందించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

పామర్రు(గ్రామీణం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేశామని పామర్రు ఎస్సై అవినాష్ శుక్రవారం తెలిపారు. జురుఘువరానికి చెందిన కొలుసు శ్రీవల్లికి అవనిగడ్డకి చెందిన గోళ్ల కిషోర్‌తో గత నెల ఆగస్టులో వివాహమైంది. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి అదనపు కట్నం తేవాలని శ్రీవల్లిని భర్త వేధిస్తుండటంతో ఆమె ఈనెల 9న పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో రాజీ కుదురకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

'జగన్‌ను అడ్డుకోవాలని చూడటం దారుణం'

పామర్రు, న్యూస్‌టుడే: జగన్‌మోహన్ రెడ్డి తిరుపతి వెళ్లడాన్ని అడ్డుకోవాలని చూడటం దారుణమని వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

30 మంది ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి గాను 16 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. ఏఎన్‌వో ఎల్టీ డీఆర్ నాగరాజు ఎస్‌డీలు 16, ఎస్‌డబ్ల్యూలు 14, రిజర్వుడులో నలుగురిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కల్నల్ సన్సార్ సింగ్ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి.

పెట్రో కెమికల్స్ పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- ఐదేళ్లలో గుజరాత్, ఆంధ్ర, ఒడిశాల్లో ఈ రంగంలో 3.7 లక్షల మందికి ఉపాధి
- కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా



పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న నివేదితా శుక్లా

ఈనాడు, విశాఖపట్నం: గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల్లో మూడు పెట్రోకెమికల్, పెట్రో ఇండస్ట్రియల్ రీజియన్ (పీసీపీఐఆర్)ల ద్వారా రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 3.7 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా వెల్లడించారు. వికసిత్ భారత్‌లో భాగంగా వచ్చే ఐదేళ్లలో ఆ లక్ష్యాలను చేరుకుంటామని ప్రకటించారు. పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌లో అనుకూల వాతావరణం కనిపిస్తోందన్నారు. అక్టోబర్ 17 నుంచి 19 వరకు ముంబయిలో కేంద్ర ప్రభుత్వం, ఫిక్కీ ఆధ్వర్యంలో 13వ ఇండియా కెమ్-2024 ప్రదర్శన జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖలో శుక్రవారం నిర్వహించిన పారిశ్రామికవేత్తల సమావేశంలో నివేదితా శుక్లా మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పెట్టుబడిదారుల స్నేహపూర్వక వాతావరణం కనిపిస్తోంది. ఇక్కడ సువిశాల తీరప్రాంతం ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో ఉంది. కొత్త ప్రభుత్వం ఈ ఏడాది రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చి, 1.3 లక్షల మందికి ఉపాధి చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఎక్కువ పెట్టుబడులు ఏపీకి తీసుకువచ్చేలా ఇండియా కెమ్ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థలో రసాయన, పెట్రో కెమికల్స్ రంగం చాలా కీలకమైంది. ప్రపంచ మార్కెట్‌లో మనం ఆరో స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం రసాయన మార్కెట్ విలువ సుమారు 220 బిలియన్ డాలర్లుగా ఉంది. 2040 నాటికి రూ.లక్ష కోట్ల రూపాయలకు పెరుగుతుంది' అని చెప్పారు.

యువతకు శిక్షణ ఇవ్వాలి

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఉపాధి అవకాశాల కోసం యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారి కోసం నిబంధనలు సరళతరం చేయాలని సూచించారు. రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానంతో ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి వీలవుతుందన్నారు. ఈ ఏడాది కేంద్రం బడ్జెట్‌లో కేటాయించిన వంద పార్కుల్లో మూడు మన రాష్ట్రానికి కేటాయించాలని, వాటిలో ఒకటి ప్రత్యేకంగా కెమికల్ పార్క్ ఉండేలా చూడాలని కోరారు. ఏపీలో పీసీపీఐఆర్ ఉన్నప్పటికీ భారీ పరిశ్రమలేవీ రాలేదని.. దీని గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో ఇటీవలే మాట్లాడారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 30 పారిశ్రామికవాడల ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించామన్నారు. కార్యక్రమంలో కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి దీపాంకర్ అరోన్, గంగవరం పోర్టు సీఈఓ అమిత్ మాలిక్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుదర్శన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



జగన్‌తో సమావేశమైన జిల్లా నేతలతోపాటు ఉన్న అనంతబాబు (వృత్తంలో)

కలిసికట్టుగా పని చేయండి

వైకాపా నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్


ఈనాడు, అమరావతి: 'ప్రజాసమస్యల పరిష్కారం కోసం గట్టిగా నిలబడండి.. ఇందుకోసం ఎక్కువ సమయాన్ని కేటాయించండి.. జిల్లాలోని పార్టీ నేతలంతా ఒక కుటుంబంలా, కలిసికట్టుగా పనిచేయాలి' అని వైకాపా అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 'ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలు, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజల్లోకి వెళ్లేందుకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల అధ్యక్షుల ఎంపికపై నేతలతో చర్చించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా కురసాల కన్నబాబునే కొనసాగించాలని నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికిచెందిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను ఇప్పటికే నియమించినందున.. కోనసీమ జిల్లాకు ఎస్సీ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలని నేతలు సూచించినట్లు తెలిసింది. దీంతో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్‌ను కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఖరారుచేసినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇటీవలి ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీచేసి ఓడిన రాపాక వరప్రసాదరావు గైర్హాజరయ్యారు.

ఎమ్మెల్సీ అనంతబాబు ప్రత్యక్షం: కాకినాడ, కోనసీమ జిల్లాల వైకాపా నేతలతో జగన్ నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ అనంతబాబు హాజరవ్వటం చర్చనీయాంశంగా మారింది. దళిత యువకుడి హత్య కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లిన ఆయన ఇప్పుడు బెయిల్‌పై బయట ఉన్నారు. హత్య జరిగినప్పుడు ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇప్పటికీ ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయలేదు. కానీ అనంతబాబు మాత్రం గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్వహించిన చాలా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇప్పుడు కూడా క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రత్యక్షమవడం గమనార్హం.

రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాల స్వాధీనం

చెన్నై నౌకాశ్రయంలో పట్టివేత

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: చెన్నై నౌకాశ్రయంలో రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి వారు తెలిపిన వివరాల మేరకు... చెన్నై నౌకాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు ఓడలో వెళ్లనున్న కంటెయినర్‌లో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అందులో 112 కిలోల సూడోఎఫెడ్రిన్ అనే మత్తు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. దీని రవాణాకు ఉపయోగించిన 2 లగ్జరీ కార్లతో పాటు రూ.3.9 లక్షలు స్వాధీనం చేసుకుని అబుతాహిర్, అహ్మద్ బాషా అనే ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా.. ఇదే విధంగా నాలుగుసార్లు ఆస్ట్రేలియాకు మత్తు పదార్థాలు తరలించారని, అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు ఇందులో ప్రమేయం ఉందని తేలింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



విజయం దక్కాలంటే..

విజయం సాధించాలంటే ప్రేరణ అవసరం. కానీ అదొక్కటే సరిపోదు. ప్రారంభించే ధైర్యం ఉండాలి. మొదలుపెట్టిన పనిని నిలకడగా కొనసాగించాలి. విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. అనిశ్చిత పరిస్థితులు, వైఫల్యాలను అధిగమించగల మానసిక బలం కావాలి. వీటన్నింటికీ ఆప్తుల అండదండలూ తోడవ్వాలి.

– హిమాన్షు త్యాగి, ఐఎఫ్ఎస్ అధికారి

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన విరమణ

- మంత్రి హామీలకు సానుకూలంగా నిర్ణయం

ఈనాడు, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆందోళన కార్యక్రమాలను విరమించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నుంచి లభించిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు లేఖను వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు సచివాలయంలో శుక్రవారం అందజేశారు. ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ వైద్యవిద్యకు కేటాయించిన సీట్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85ను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి పీహెచ్‌సీ వైద్యులు ఆందోళనలు చేస్తున్నారు. సంఘం ప్రతినిధులతో చేపట్టిన చర్చల్లో మంత్రి సత్యకుమార్ 85 జీఓను సవరిస్తామని, క్లినికల్ విభాగంలో 15% బదులు 20% సీట్లను అన్ని స్పెషాలిటీల్లో కేటాయిస్తామని తెలిపారు. సంఘంతో చర్చించిన తర్వాతే ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకుంటామని, ఇతర డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. వీటిని స్వాగతిస్తూ..



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు లేఖ అందిస్తున్న వైద్య సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్ తదితరులు

సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్, ఇతర వైద్యులు కృష్ణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17 నుంచి తాము విధుల్లో ఉన్నట్లు పరిగణించి వేతనాలు చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, ట్రైబల్ ఎలవెన్సులు చెల్లించాలని అందులో కోరారు.

నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదుకు ఆదేశం



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని బెంగళూరు తిలక్‌నగర ఠాణా పోలీసులను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను నిర్మలా సీతారామన్ బెదిరించి భాజపాకు నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ అయ్యర్ గతంలో తిలక్‌నగర ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేశారు.

అక్కడికి నేనొచ్చినట్లు ఎవరూ చెప్పలేదు

'ఈనాడు' కథనానికి సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ వివరణ

ఈనాడు, అమరావతి: మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అరెస్టయిన రోజున తాను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయానికి వచ్చినట్లు ఎవరూ వాంగ్మూలం ఇవ్వలేదని సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ తెలిపారు. 'కస్టడీలో రఘురామకు చిత్రహింసలు నిజమే' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఓ ప్రకటనలో ఆయన వివరణ ఇచ్చారు. "ఆరు నెలలకు మించి కాల్ డేటా ఉండదు. అదే విషయం టెలికం సంస్థలూ చెప్పాయి. అలాంటిది నా లొకేషన్ ఎలా వచ్చింది? అది అబద్ధం. రఘురామ కృష్ణరాజుకు గాయాల్లేవంటూ ఇచ్చిన సర్టిఫికెట్‌కు గుంటూరు వైద్యులు కట్టుబడి ఉన్నారు. వారు వేరే విధంగా వాంగ్మూలం ఇవ్వలేదు, ఇవ్వరు కూడా. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చామని ఒప్పుకొంటే వారి డాక్టర్ సర్టిఫికెట్ రద్దవుతుంది. రఘురామకు గాయాలు ఉన్నాయని, కొట్టడంవల్లే అవి అయ్యాయని మిలటరీ ఆసుపత్రి వైద్యులు చెప్పలేదు. మిలటరీ డాక్టర్లు సివిల్ కోర్టులకు రారు, సాక్ష్యం చెప్పరు. అది ఆర్మీ యాక్టు వారికి కల్పించిన రక్షణ" అని సునీల్‌కుమార్ వివరించారు.

మార్చిలో ఇంటి నిర్మాణ సాయం పెంపు: మంత్రి కొలుసు

చాట్రాయి, న్యూస్‌టుడే: అందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో త్వరలో స్థలాల కొనుగోలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోనున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా మర్లపాలెంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. మార్చిలో గృహనిర్మాణ సాయం మొత్తాన్ని పెంచుతామని, ఎంత పెంచాలనేదానిపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సొంత స్థలం ఉన్న పేదలు వెంటనే గృహాలు నిర్మించుకునే అవకాశముందని పేర్కొన్నారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు

- 'ముడా' అంశంపై లోకాయుక్త చర్యలు

ఈనాడు, బెంగళూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) స్థలాల పంపిణీ అక్రమాల్లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్రంలో కేసు నమోదైంది. మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఈ కేసు నమోదుచేశారు. ముడా అక్రమాలపై విచారణ చేపట్టిన సంబంధిత కోర్టు.. 3 నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల లోకాయుక్తను ఆదేశించిన క్రమంలో ఈ చర్యలు చేపట్టారు. స.హ. కార్యకర్త స్నేహమయి కృష్ణ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కోర్టు ఈ తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముఖ్యమంత్రి ఏ1, ఆయన సతీమణి పార్వతి ఏ2, బావమరిది మల్లికార్జున స్వామి ఏ3, భూములు విక్రయించిన దేవరాజు ఏ4, ఇతరులను ఏ5 నిందితులుగా పేర్కొన్నారు. సీఎంపై భూ ఆక్రమణల నియంత్రణ, అవినీతి నిరోధక, ఫోర్జరీ, బినామీ ఆస్తుల పరిరక్షణ, అధికార దుర్వినియోగం తదితర అభియోగాల కింద పలు సెక్షన్లు పెట్టారు. ఈ క్రమంలో తన రాజీనామా కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'గోద్రా కేసులో ఆనాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీ రాజీనామా చేశారా? అక్రమ గనుల తవ్వకాల కేసులో బెయిల్‌పై ఉన్న కేంద్రమంత్రి కుమారస్వామి నుంచి ప్రధాని రాజీనామా కోరారా?' అంటూ ప్రశ్నించారు. తాను తప్పు చేయలేదని, రాజీనామా చేయనని స్పష్టం చేశారు.

రాజీనామా చేయాల్సిన అవసరం లేదు: ఖర్గే



విలేకర్లతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన అవసరంలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. కేసు నమోదు చేయగానే సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటే.. గోద్రా కేసులో మోదీ రాజీనామా చేశారా? అమిత్ షా పైనా కేసులున్నాయి కదా? అని గుర్తు చేశారు. సీబీఐకి సాధారణ సమ్మతి ఉపసంహరణ చర్యనూ ఖర్గే సమర్థించారు.



ఆల్బమ్ ఆవిష్కరిస్తున్న గద్దె అనూరాధ, బొండా సుజాత, నిర్వాహకులు

ఆకట్టుకుంటున్న నగల ప్రదర్శన

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నగరంలోని మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ ఎ ప్లస్ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే పాన్ ఇండియా జ్యూయలరీ ప్రదర్శనను శుక్రవారం జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ, బొండా సుజాత ప్రారంభించారు. నిర్వాహకులు సజ్జా అన్నపూర్ణ, నిరంజన్ మాట్లాడుతూ... రానున్న పండగలు, వివాహాది శుభకార్యాల సందర్భంగా బంగారం, వజ్రాభరణాల కొనుగోలుకు జైపూర్, ముంబాయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ఆభరణాల నిర్వాహకులు ఈ ప్రదర్శనలో 30కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారని, ఇక్కడే కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. అనేక రకాల డిజైన్లలో వజ్రాభరణాలు తమ స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ నెల 29న రాత్రి 8 గంటల వరకు మాత్రమే ప్రదర్శన ఉంటుందని, ప్రజలు సందర్శించాలని కోరారు.

జగన్మాత సేవలో కర్ణాటక మంత్రి

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను కర్ణాటక అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ జగదీష్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ జగదీష్

కళాంజలిలో సరికొత్త కలెక్షన్

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాల రోడ్డులోని కళాంజలిలో దసరా, దీపావళి పండగల సందర్భంగా సరికొత్త డిజైన్లు సిద్ధంగా ఉన్నాయి. ఆధునికత, నాణ్యత, అందుబాటు ధరల్లో లభించే దుస్తులు వినియోగదారులను ఆకట్టుకున్నాయి. అత్యాధునిక డిజైన్లు, ఆకర్షణీయమైన రంగులతో కూడిన సల్వార్స్, పలాజో, చూడీ, అనార్కలీ మోడల్స్ కొలువుతీరాయి.

ప్రత్యేక రాయితీలు

పండగల సందర్భంగా అన్ని రకాల డిజైన్లు, డ్రెస్‌లపై 30 శాతం రాయితీ, సరికొత్త స్టాక్‌పై ఒకటి కొంటే మరొకటి ఉచితంగా అందిస్తున్నారు. ముఖ్యంగా అనార్కలి, స్ట్రయిట్, షార్ట్‌టాప్ విత్ పలాజో, లాంగ్ గౌన్లు, గాగ్రాస్, క్రాప్ టాప్స్‌పై కూడా ప్రత్యేక రాయితీ ఉంది. టాప్స్, కుర్తీస్, లెగ్గింగ్స్ అందుబాటులో ఉన్నాయి. అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.



సల్వార్ సూట్స్ ధరించిన యువతులు

రాకెట్‌లా దూసుకుపోతూ..

బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న చరిష్మ

70 వరకు పతకాలు కైవసం

ఈనాడు డిజిటల్, అమరావతి

బుడిబుడి అడుగుల ప్రాయంలోనే రాకెట్ (బ్యాడ్మింటన్) పట్టుకుంది.. కిందపడి దెబ్బలు తగిలినా.. పట్టువీడకుండా సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల సాధిస్తోంది. విజయవాడలోని సీతారాంపురానికి చెందిన తమిరి సూర్య చరిష్మ తండ్రి నవీన్‌బాబుతో రోజూ ఉదయం వ్యాయామం కోసం బ్యాడ్మింటన్‌ను అలవాటు చేసుకుంది. తండ్రి సాధన చేస్తూ.. విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో చరిష్మ రాకెట్ పట్టుకుని చురుగ్గా ఆడేది. కుమార్తె ఆసక్తిని గుర్తించి తండ్రి నవీన్ బ్యాడ్మింటన్ కోచ్ భాస్కర్ వద్ద చేర్పించారు. ఇంటికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియానికి సైకిల్ మీద వెళ్లి సాధన చేసేది. కరోనా సమయంలో కూడా ఆన్‌లైన్‌లో మెలకువలు నేర్చుకుంది. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అన్ని విభాగాల్లో కలిపి 70 వరకు పతకాలు సాధించింది.

సాధించిన విజయాలు కొన్ని..

★★ 2022లో బెంగళూరులో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో బంగారు పతకం. ★★ 2023లో 37వ నేషనల్ గేమ్స్‌లో, హైదరాబాద్‌లో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ సింగిల్ విభాగంలో రజత పతకాలు. ★★ 2024 హైదరాబాద్, తమిళనాడు, జరిగిన యూత్ గేమ్స్, జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో బంగారం పతకాలు. ★★ 2024 ఫిబ్రవరిలో బెంగళూరులో జరిగిన సీనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్ లో సింగిల్ విభాగంలో వెండి పతకాలు సాధించింది.



ఒలింపిక్స్‌లో పతకం గెలవాలి

క్రీడలే నా భవిష్యత్తు. చదువుతూ.. నిరంతరం సాధన చేస్తున్నాను. మాలాంటి వారిని ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహిస్తే మరింత రాణిస్తాం. ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం సాధించడమే లక్ష్యం.

- తమిరి సూర్య చరిష్మ

ఐదునెలలు మంచానికే పరిమితం..

ఆటలో మునిగిపోయి.. చరిష్మ చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. క్రీడా విభాగంలో ఛత్తీస్‌గఢ్‌లోని ఓ యూనివర్సిటీలో డిగ్రీ సీటు ఉచితంగా సాధించింది. 2022లో సాధన చేస్తున్న క్రమంలో కుడికాలికి తీవ్ర గాయమైంది. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడంతో ఐదు నెలలు ఇంటికే పరిమితమయ్యింది. తరువాత కోలుకుని సాధన మొదలుపెట్టింది.

ఎమ్మెల్యే కొలికపూడి తీరుపై శ్రేణుల నిరసన

కరెన్సీనగర్(విజయవాడ): తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు తీరుపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. మహిళల ఆత్మగౌరవంతో పుట్టిన తెదేపాలో వేధింపులు పాల్పడడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మూడు నెలల కిందట పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యే ఆగడాలను ఆదిలోనే అరికట్టాలని పిలుపునిచ్చారు. నాలుగు రోజుల కిందట చిట్టేల సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావును అసభ్య పదజాలంతో ఎమ్మెల్యే దూషించగా.. ఆయన భార్య కవిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె ప్రస్తుతం విజయవాడ ఆయుష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులు ఘటనకు కారణమైన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలంటూ ఆసుపత్రి వద్ద నినాదాలు చేశారు. బాధితుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. . 'అధికార అహంతో గుడ్డలు ఊడదీసి కొడతాననడం సభ్య సమాజం హర్షించడం లేదు. 30 ఏళ్లుగా తెదేపాను నమ్ముకున్న మాపై దుర్భాషలాడారు. ఎమ్మెల్యే భాష సరిగా లేదు. మహిళలు, యువత ఇబ్బందులు పడుతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ కేశినేని శివనాథ్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. చరవాణుల్లో మెసేజ్‌లు పెడుతూ తమ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని, విలేకరులపైనా నోరు పారేసుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఆస్పత్రి ఎదుట నినాదాలు చేస్తున్న తెదేపా కార్యకర్తలు

'కొలికపూడి' గ్రావెల్, ఇసుక, మద్యం, బియ్యం అక్రమదందా

- పల్లా శ్రీనివాసరావుకు తిరువూరు తెదేపా నాయకులు, కార్యకర్తల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి : నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అరాచకాలకు అడ్డూఆపూ లేకుండా పోతోందని తిరువూరుకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలని కూడా చూడకుండా నోటికొచ్చినట్టు దుర్భాషలాడుతున్నారని వాపోయారు. నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుక, మట్టి, రేషన్ బియ్యాన్ని దోచుకుంటూ సొమ్ముచేసుకుంటున్నారని.. .ఇదేంటని ప్రశ్నిస్తే దుస్తులు ఊడదీసి కొడతానని పార్టీ శ్రేణుల్ని నోటికొచ్చినట్టు తిడుతున్నారని మండిపడ్డారు. చిట్టేల సర్పంచి శ్రీనివాసరావునూ నడిరోడ్డు మీద ఇష్టారీతిన దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. కొలికపూడి వేధింపులు భరించలేకే శ్రీనివాసరావు సతీమణి కవిత ఆత్మహత్యాయత్నం చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు 35 మంది కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. కొలికపూడి ఉంటే నియోజకవర్గంలో పార్టీ బతకదని తేల్చిచెప్పారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిని నియమించాలని కోరారు. ఆయన దోపిడీని, అరాచకాల్ని ప్రశ్నిస్తున్నందుకే 30 ఏళ్లుగా పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నవారినీ లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నారని వెల్లడించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ వివాదంపై కొలికపూడిని పిలిచి మాట్లాడతామని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. "కొలికపూడి వేధింపులతో నాయకులు తిరిగే పరిస్థితి లేదు. మాకీ ఎమ్మెల్యే వద్దు" అని బోయపాటి సునిత పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి మనుషుల్ని తెప్పించుకొని ఎమ్మెల్యే దౌర్జన్యం చేస్తున్నారని అనుమోలు వెంకటేశ్వరరావు ఆరోపించారు. ముక్కూమొహం తెలియని కొలికపూడిని పార్టీ మీద గౌరవంతో గెలిపిస్తే...వైకాపా వాళ్లకు పనులు చేసిపెడుతూ....తమను వేధిస్తున్నారని నాగరాజు వాపోయారు.

ఫేస్‌బుక్ వేదికగా సంచలన ప్రకటన

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఫేస్‌బుక్ వేదికగా శుక్రవారం చేసిన సంచలన ప్రకటన చర్చనీయాంశంగా మారింది. 'అగ్నిపర్వతం బద్దలయ్యే ముందు.. భయంకరమైన ప్రశాంతంగా ఉంటుంది' అంటూ ఆయన చేసిన పోస్టు వైరల్‌గా మారింది.

పాఠశాలలో కీచక పర్వం

- ఉన్నతాధికారులకు ఉపాధ్యాయుల ప్రవర్తన చిట్టా
- 'లెక్క' తేల్చాలని తల్లిదండ్రుల ఆందోళన

న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం

భావి పౌరులను తీర్చిదిద్దాల్సిన దేవాలయాలు బూతులకు, చిన్నారులపై అఘాయిత్యాలకు నెలవుగా మారుతున్నాయి. గుడివాడ మండలం చౌటపల్లి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న కీచక పర్వం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. ఓ ఉపాధ్యాయుడిపై ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు గుడివాడ ఉప విద్యాశాఖాధికారి పద్మారాణి వారం రోజుల కిందట పాఠశాలకు వెళ్లి విచారించగా నాలుగో తరగతి విద్యార్థినిని వేధింపులకు గురిచేసి గురువారం అరెస్టు అయిన పీడీ చంద్రశేఖర్‌పై ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. పద్ధతి మార్చుకోకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను ఆమె హెచ్చరించారు. విద్యార్థులపై వేధింపులు, వెకిలి చేష్టలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణల దృష్ట్యా సంబంధిత ఉపాధ్యాయులను గట్టిగా మందలించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు పీడీ చంద్రశేఖర్ ప్రవర్తనపై విద్యార్థుల తల్లిదండ్రులను రెచ్చగొట్టారని సమాచారం. ఇందులో భాగంగానే బాలికపై అసభ్యంగా ప్రవర్తించినందుకు ఆమె తల్లి పీడీ చంద్రశేఖర్‌ను పాఠశాలలోనే చెప్పుతో కొట్టారు. అనంతరం మహిళా పోలీసు సమక్షంలో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో చంద్రశేఖర్‌తోపాటు మరో ఉపాధ్యాయుడు కూడా చిన్నారులను వేధిస్తున్నారని అతని 'లెక్క' కూడా తేల్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై గ్రామస్థులు పాఠశాలలోని ఉపాధ్యాయులందర్నీ తొలగించాలని కోరుతున్నారు.

బ్యాడ్ టచ్‌పై డీవైఈవో విచారణ.. గుడివాడ ఉప విద్యాశాఖాధికారిణి పద్మారాణి శుక్రవారం చౌటపల్లి పాఠశాలలో బ్యాడ్ టచ్ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ప్రతి విద్యార్థినినీ విచారించి ఉపాధ్యాయుల ప్రవర్తన ఎలా ఉంది? బాలికలతో ఎలా వ్యవహరిస్తున్నారు? మాటతీరు గురించి పూర్తి వివరాలను లిఖిత పూర్వకంగా తీసుకొని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా ఉపాధ్యాయుల ప్రవర్తనపై ఆరా తీశారు.

చంద్రశేఖర్ సస్పెన్షన్... నాలుగో తరగతి బాలికను బ్యాడ్ టచ్ చేసిన వ్యవహారంలో పీడీ ఎం.చంద్రశేఖర్ అరెస్టు కావడంతో అతడ్ని సస్పెండ్ చేశామని డీవైఈవో పద్మారాణి తెలిపారు. అరెస్టు చేసి 24 గంటలు దాటిన వెంటనే అతడ్ని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ నుంచి వచ్చిన ఉత్తర్వులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందించామన్నారు.